


చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	23.4

తుంటి మార్పిడిలో ప్రభుత్వ వైద్యుల ఘనత

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో తుంటి, మోకాలుచిప్పల మార్పిడి శస్త్రచికిత్సలో అరుదైన ఘనత సాధించారు. ఆస్పత్రిలో ఇప్పటి వరకు 40 తుంటి ఆపరేషన్లను ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ చైతన్య విజయవంతంగా పూర్తిచేశారు.

6

సండే స్పెషల్
SUNDAY SPECIAL

బతుకులో తీపి లేదు కారమే మిగిలింది

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

భోజనం రుచికరంగా ఉండాలంటే చేయి తిరిగిన చెఫ్‌తో వంట చేయించాల్సిందే. అయితే వంట రుచికరంగా ఉండేందుకు చేయి తిరిగిన చెఫ్‌తో వండితే మాత్రమే సరిపోదు.. ఉప్పు 'కారం' సరిపడా పడితేనే ఇష్టమైన ఆహారాన్ని ఆహా అంటూ లొట్టలేసుకుని తింటాం. పైగా తెలంగాణా ప్రాంత ప్రజలకు 'కా రం' మీద కాస్త మమకారం ఎక్కువే. ఇక్కడి సంప్రదాయ వంటకాల్లో వండే పదార్థం, ఆహారం ఏదైనా సరే కొంత మిర్చి ఘాటు తగలాల్సిందే. లేదంటే చప్పగా ఉందంటూ నిట్టూరుస్తారు. అదీ ఎండు మిర్చి కారానికి ఉన్న ప్రాధా న్యం. అయితే పారిశ్రామిక వాడలు, పట్టణాల్లో అయితే ఎండు మిర్చిని పెద్ద పెద్ద యంత్రాలతో కారంగా మార్చి నేరుగా ప్యాకెట్ల రూపంలో మార్కెటింగ్ చేస్తున్నారు. కానీ, గ్రామీణ ప్రాంతాల్లో అయితే చేనులో పెరిగిన ఎండు మిర్చి కారంగా మారి మన ఇంటికి చేరడంలో ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి ఎంతో మంది మహిళలు కారం మిల్లులను నిర్వహిస్తున్నారు. ఆరోగ్యానికి హానికరమని తెలిసినా తప్పని జీవన ఆరాటంలో కారంతో పోరాటం చేస్తున్న ఆ మహిళల శ్రమను గుర్తించడం మన కనీస మానవత. కంట్లో నలత పడితేనే విలవిలలాడి పోతాం. అలాంటిది కంట్లో కారం ధూళి పడితే పడే ఇబ్బంది అంతా ఇంతా కాదు. ఎంత కాలం పనిచేసినా 'కారం' గానే తప్ప 'తీపి' లేని జీవితాలే అవుతున్న కారం మిల్లులను నడిపే మహిళల జీవన చిత్రంపై నేటి 'సండే స్పెషల్'..



నార్కట్‌పల్లిలో మిల్లులో కారం దంచుతున్న ఏసుగు పద్మ

» మిల్లు నడిస్తినే ఇల్లు గడిచేది » ఎండాకాలం వస్తే ఏడుపొస్తది
» ఊపిరాడదు, నిద్రపట్టదు » రెండు పూటలా స్నానం.. అయినా ఉపశమనం కరువు

కారం మిల్లుల్లో పనిచేసే మహిళలకు ఏకాగ్రత తప్పనిసరి.ప్రస్తుతం కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక నమూనాతో వచ్చిన కారం మిల్లులను నడుపుతున్నారు. కానీ 50ఏళ్ల కిందట అలా కాదు. రోకళ్ల స్టాండ్‌కు అడుగుభాగంలో రెండు గుంటలు ఉండేవి. వాటిలో ఎండు మిర్చి వేసి దంచేటప్పుడు పొరకతో గుంటలోకి దోపడం, కారం పొడిని రేకుతో లాగడం వంటివి చేసేవారు. ఎండు మిర్చి వేసి రోకళ్లతో దంచేటప్పుడు ఏ మాత్రం ఏకాగ్రత చెదిరినా, దృష్టి మరలినా ప్రమాదం బారిన పడాల్సిందే. ఎండు మిర్చిని పొడిగా మార్చేందుకు దంచుతూ వేగంగా కిందికి పైకి కదిలే స్టీలు రోకళ్ల కింద వేలు పడిందా నలిగిపోవాల్సిందే. ఇలా రోకళ్ల కింద ఏమరుపాటులో చేతులు పడి వేళ్లు నలిగిన బాధితులూ ఉన్నారు.

ఒకసారి వేళ్లు నలిగాయి



1972 నుంచి 2002 వరకు సుమారు 30 ఏళ్ల పాటు నిరంతరాయంగా కారం మిల్లు, పిండి గిర్నీలు నడిపించా. కారం మిల్లు, పిండి మిల్లు ఏదైనా ఆరోగ్యానికి హానికరమే అని తెలిసినా కుటుంబ బాధ్యతలు ఆ పనినే ఉపాధిగా చూపాయి. కారం దంచేందుకు ఇప్పుడు కొంత అధునాతన యంత్రాలు వచ్చాయి. కానీ 30 ఏళ్ల కిందట ఇలాంటి యంత్రాలు లేవు. రోకళ్లు దంచేప్పుడు వాటి దగ్గరే కూర్చుని ఏకాగ్రతగా ఉండాల్సి వచ్చేది. ఒకసారి ఏమరుపాటుగా ఉన్న సమయంలో రోకలి కింద పడి కుడిచేతి వేళ్లు రెండు నలిగిపోయాయి. అయినా జాగ్రత్త పడుతూ పనిచేశా. కారం మిల్లు నడిపి వచ్చిన రోజు చిన్నపిల్లలను దగ్గరకు తీసుకోవాలంటే కొంత ఆలోచించాల్సి వచ్చేది.

- రంగ ధనమ్మ, కారం మిల్లు నిర్వాహకురాలు, నార్కట్‌పల్లి

కర్ణభేరి అదిరేలా శబ్దం

ఎండు మిర్చిని పొడిగా మార్చాలంటే బియ్యపు పిండి మరలాకాదు. ఇనుప రోకళ్లతో దంచాలి. అందుకోసం రోకళ్ల స్టాండ్‌కు అడుగున భూమి ఏ మాత్రం అదరకుండా

- మిగతా 6వ పేజీలో...

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి




ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని ఐటీఐ కళాశాల, ఏటీసీ సెంటర్, ఔటర్‌రింగ్ రోడ్డు, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలతో పాటుగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణ పనులను, మోడల్‌కాలనీ పనులను మంత్రి ఉత్తమ్ పరిశీలించారు. అనంతరం ఆయన నివాసంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధిని ఒక యజ్ఞంగా తలపెట్టామని, వాటిని అధికారులు చిత్తశుద్ధితో పనిచేయించాలన్నారు. పనుల్లో నాణ్యత లేకుంటే అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులను అవసరమైతే సస్పెండ్ కూడా చేస్తామన్నారు. నాణ్యతలో రాజీపడబోమన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఐటీఐ సెంటర్‌లో జూలై నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించి 172 మందికి శిక్షణ కల్పిస్తామన్నారు. సుమారు రూ.35 కోట్లతో టాటా కంపెనీ ద్వారా పరికరాలను తయారుచేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. పట్టణంలో ఔటర్ రింగ్ రోడ్డు పనులు పూర్తిచేయాలని, విద్యుత్ లేన్లు త్వరగా మార్చాలని ఆదేశించారు.

పట్టణంలో రహదారిబంగ్లా, ఈఈ, డీఈ కార్యాలయాలు పూర్తిచేయాలన్నారు. రహదారి బంగ్లా ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని ఆదేశించారు. మోడల్‌కాలనీ ఇళ్లు జూలై నాటికి పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రూ.8.5కోట్లతో జూనియర్ కళాశాల, రూ.4.5 కోట్లతో డిగ్రీ కళాశాల భవనాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో సూర్యనారాయణ, ఎస్‌ఈ సీతారామయ్య, ఈఈ వెంకటయ్య, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, హౌసింగ్ ఎస్‌ఈ వెంకటదాసిరెడ్డి, డీఈ జగన్, ఏఈ సాయిరాంరెడ్డి, తన్నీరు మల్లికార్జున్‌రావు, దొంగరి వెంకటేశ్వర్లు, గూడెపు శ్రీనివాసు, దొంతగాని శ్రీనివాసు, హరిబాబు, అజీజ్‌పాషా, సాముల శివారెడ్డి, కుంట సైదులు, సైదులునాయక్, శివరామ్‌యాదవ్, గోపిరెడ్డి, కడియాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతిపై భానుడి ఎఫెక్ట్





ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకం ఎంతో మందికి లబ్ధిచేకూర్చింది. కొద్దికాలంలోని ఈ పథకం ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిం ది. అయితే భానుడి ప్రభావంతో వేలాది మంది వినియోగదారులు గడిచిన రెండు నెల ల్లో ఈ పథకానికి దూరమయ్యారు. రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రతకు విద్యుత్ వినియోగం పెరిగి మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. పరిమితికి మించి విద్యుత్ వినియోగం అవుతుండడంతో పలువురు ఉచిత విద్యుత్‌ను అందుకోలేకపోతున్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి మాత్రమే గృహజ్యోతి వర్తింపజేస్తుండగా, ఈ వేసవిలో వేలాది మంది అంతకు మించి వినియోగించడంతో బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. దీంతో వారిపై అదనపు భారం పడుతోంది. మార్చి నుంచి ఎండ ల ప్రభావం ఉండడంతో వినియోగదారులు ఈ పథకం నుంచి ఒక్కొక్కరూ దూరమవుతూ బిల్లులు కట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్)

» చేజారిన ఉచిత రాయితీ » పెరిగిన విద్యుత్ వినియోగం » 200 యూనిట్ల పరిమితి దాటుతున్న యూనిట్లు

గడిచిన రెండు నెలలుగా జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరి నుంచే పగటి ఉష్ణోగ్రతలు పెరగ్గా, మార్చిలో 40 డిగ్రీల మార్కు దాటింది. ఏప్రిల్, మే నెలల్లో 41 నుంచి 42 డిగ్రీల వరకు ఎండలు పెరిగాయి. దీంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఫలితంగా కూలర్లు, ఫ్రిజ్‌ల వినియోగం పెరగడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగి విద్యుత్ మీటర్ రీడింగ్ 200 యూనిట్లు దాటుతోంది. దీనికి తోడు పిల్లలకు వేసవి సెలవులు రావడంతో వారు టీవీలకే అతుక్కుపోతున్నారు. ఈ ప్రభావం కూడా గృహ జ్యోతిపై పడినట్లు తెలుస్తోంది. ఇంట్లో టీవీ, ఫ్రిజ్, బలుబ్బులు, ఫ్యాన్లు ఉంటే సాధారణంగా 120 నుంచి 150 వరకు యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతుంది. మార్చి నుంచి ఈ వినియోగం పెరిగింది. 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు వినియోగం పెరగ్గా, ఏప్రిల్, మే నెలలో అది కాస్త 200ల యూనిట్లకు పైగా రీడింగ్ నమోదువుతోంది. జిల్లాలో రెండు నెలలుగా 20వేల మందికిపైగా వినియోగదారులు ఉచిత విద్యుత్‌కు దూరమయ్యారు. 1,200 యూనిట్లు దాటిన వారికి రూ.వెయ్యికి పైగా బిల్లు వస్తోంది.



జిల్లాలో ఇది పరిస్థితి

జిల్లాలో వివిధ కేటగిరీలకు సంబంధించి 8,18,696 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 4,91,650 గృహ వినియోగదారులు, 71,548 వాణిజ్య వినియోగదారులు, పరిశ్రమలకు సంబంధించి 4,556, చిన్న తరహా పరిశ్రమలకు సంబంధించి 2,227, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 2,36,179, వీధి దీపాలకు సంబంధించి 9,869, పాఠశాలలు, గుడులు, మసీదులు, చర్చీలకు సంబంధించి 2,667 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే కేటగిరీ-1లో ఉన్న గృహవిద్యుత్ వినియోగదారులకు సంబంధించి యూనిట్ ధర 1 నుంచి 50 యూనిట్ల వరకు రూ.1.95, 51-100 యూనిట్ల వరకు రూ.3.10, 101-200 యూనిట్ల వరకు రూ.4.80, 200 యూనిట్లు దాటితే రూ.5.10 వరకు యూనిట్ ధర ఉంది. 250-300 వరకు రూ.7.70, 301-400 వరకు రూ.9, 401-800 యూనిట్ల వరకు రూ.9.50, 800 యూనిట్లకుపైగా ఉంటే రూ.10 చొప్పున బిల్లులు చెల్లించాలి. ఈ లెక్కన 200 యూనిట్లు దాటిన వారు రూ.1,200 వరకు నెలవారీ విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వస్తోంది.

20 వేల మందికిపైగా పథకానికి దూరం

వివిధ కేటగిరీలకు సంబంధించి జిల్లాలో మొత్తం 8,18,687 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కేటగిరీ-1 గృహ వినియోగం పరిధిలోకి వస్తుంది. అందులో 4,91,650 కనెక్షన్లు ఉండగా, గృహజ్యోతికి సంబంధించి 2,38,000 కనెక్షన్‌లు, వీటిలో 2,28,907 మంది వినియోగదారులకు ఉచిత విద్యుత్ వర్తిస్తుంది. ఏప్రిల్ నెలలో 200 యూనిట్లలోపు వినియోగించిన 2,18,910 మందికి మాత్రమే పథకం వర్తించింది. ఆపై యూనిట్లు పెరిగిన సుమారు పదివేలకు పైగా వినియోగదారులు ఈ పథకానికి దూరమయ్యారు.. అయితే జనవరిలో 2,24,507 మంది లబ్ధిపొంది 4400 మంది పథకానికి దూరమయ్యారు. అదేవిధంగా ఫిబ్రవరిలో 2,24,307 మంది లబ్ధిపొంది..

- మిగతా 8వ పేజీలో...

భాషలపై వివక్ష వీడాలి

తెలుగుశాఖ అధ్యక్షురాలు డాక్టర్ కె.అరుణప్రియ



ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరుణప్రియ, అధ్యాపకులు

నల్లగొండ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): యూజీసీ నిబంధనల పేరుతో ఉన్నత విద్యామండలి భాషలపై చూపిస్తున్న ఏకపక్ష ధోరణి వీడాలని తెలుగు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ కె.అరుణప్రియ అన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలల తెలుగు అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.అరుణప్రియ మాట్లాడుతూ ఇప్పటివరకు డిగ్రీ విద్యార్థులకు తెలుగుకు 20 క్రెడిట్స్ ఉండగా, యూజీసీ నిబంధనల పేరుతో 12 క్రెడిట్లకు తగ్గించడం సరికాదన్నారు. దీంతో విద్యార్థులు తర్వాత స్థాయి పీజీలో అడ్మిషన్ పొందడానికి అర్హత సాధించలేరనో, అంతేకాకుండా వివిధ కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పీజీ అడ్మిషన్ పొందటానికి, వివిధ కేంద్రీయ విద్యాలయాల్లో ఉపాధ్యాయులుగా అర్హత సాధించేందుకు ఇది ఆటంకంగా మారుతుందన్నారు. ఆర్ట్స్ కళాశాల డీన్ అంజిరెడ్డి మాట్లాడుతూ భాషల స్థాయిని తగ్గించడం వల్ల విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ నైపుణ్యం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థుల్లో ప్రతిభ ఎంత ఉన్నా భావవ్యక్తీకరణ సామర్థ్యం లేకపోతే అది వృథా అని తెలిపారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం స్థానిక భాషలకు ప్రాధాన్యమిస్తూ సాంకేతిక విద్యను కూడా మాతృభాషలోనే బోధించాలి అనే నిబంధన తీసుకొస్తున్న సమయంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి భాషల ప్రాధాన్యాన్ని తగ్గించడం శోచనీయమన్నారు.

పాలకులకు భాషపై చిత్తశుద్ధి లేకపోవడంతోనే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా మండలి తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోపోతే తెలుగు భాష ఉపాధ్యాయులు ఉద్యమబాట పట్టాల్సి వస్తుందన్నారు. అనంతరం సమావేశంలో చేసిన తీర్మానాలపై మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశానికి సమన్వయకర్తగా తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం.ఆనంద్ వ్యవహరించగా, విశ్వవిద్యాలయ స్థాయిలోని వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

యాద'గిరి'పై భక్తుల సందడి



రాష్ట్ర నలుమూలల నుంచి ఇష్టదైవాలను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో యాదగిరికొండ కిటకిటలాడింది. సుమారు 45వేల మంది భక్తులు నృసింహుడిని దర్శించుకున్నారు.

6

ప్రజాసమస్యలపై ఉద్యమాలు చేపట్టాలి

● సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్, మే24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం బలమైన ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా గుర్తించిన సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సీపీఎం కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్రద్ధ చూపకుండా అందాల పోటీల పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుచేస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, మల్లు గౌతమ్‌రెడ్డి, బావండ్ల పాండు, నూకల జగదీష్‌చంద్ర, సత్యనారాయణరావు, రామ్మూర్తి, దేశిరాం నాయక్, మల్లయ్య, అరుణ, పాపిరెడ్డి, పాదూరి గోవర్ధన, కరీమ్మున్నీసాబేగం, కరీం, రామచంద్రు పాల్గొన్నారు.

స్త్రీనిధి బకాయిలను వసూలు చేయాలి



కనగల్‌లో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

● డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

కనగల్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణ బకాయిలను వెంటనే వసూలు చేయాలని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కనగల్ మండల సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రాయల రాజేశ్వరి అధ్యక్షతన గ్రామ మహిళా సంఘం అధ్యక్షులకు, వీవోఏలకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమావేశానికి హాజరైన శేఖర్‌రెడ్డి మాట్లాడు తూ స్త్రీనిధి రుణాలను వసూలు చేయటంలో మండల వీవోఏలు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తంచేశారు. నిర్లక్ష్యం వహించే వీవోఏలను ఉపేక్షించబోమని, తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో రూ.2కోట్ల మేర మొండి బకాయిలు పేరుకపోయినట్లు వివరించారు. రుణ వసూలు చేయకుంటే కొత్త రుణాలను సంఘాలు పొందే అవకాశం కోల్పోతాయన్నారు. జిల్లావ్యాప్తంగా ఐకేపీ కేంద్రాల ద్వారా ఈ సీజన్‌లో 2.10లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం హరి, సీసీలు విజయ, వసంత, ప్రభాకర్, సిబ్బంది లలిత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకోపోతే, పింఛన్ రద్దవుతుందని డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో పింఛన్లపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి శేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పింఛన్ పొందుతూ మృతి చెందిన, వేలి ముద్రలు వేయలేని వారి వివరాలు గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీవో వెంకటయ్య, పీడీపీఎం మోహన్‌రెడ్డి, కొండమల్లేపల్లి ఎంపీడీవో బాలరాజురెడ్డి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ హరికేన్ జట్టు వైస్ కెప్టెన్‌గా సురేష్


ధరావత్ సురేష్

తిరుమలగిరి(సాగర్), మే 24(ఆంధ్రజ్యోతి): ఇండియన్ వీల్‌చైర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీకి హైదాబాద్ హరికేన్ జట్టుకు ధరావత్ సురేష్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. నల్లగొండి జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్ల తండాకు చెందిన సురేష్ కొన్నేళ్లుగా వీల్‌చైర్ క్రికెట్ విభాగంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నాడు. ఈ క్రమంలో జూన్ 8 నుంచి 14వరకు ఢిల్లీలోని బాలభవన్ ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించే ప్రీమియర్ లీగ్ పోటీల్లో హైదరాబాద్ జట్టుకు ఆడనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 8జట్లు పాల్గొననున్నాయి. మారుమూల తండా నుంచి జాతీయ స్థాయి వీల్‌చైర్ క్రికెట్ పోటీల్లో దివ్యాంగుడైన సురేష్ రాణిస్తుండడం పట్ల తల్లిదండ్రులు, స్థానికులు, తండావాసులు అభినందిస్తున్నారు.

తుంటి మార్పిడిలో ప్రభుత్వ వైద్యుల ఘనత


సూపరింటెండెంట్ ను సన్మానిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

మిర్యాలగూడ అర్బన్, మే24(ఆంధ్రజ్యోతి): నల్లగొండజిల్లా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో తుంటి, మోకాలుచిప్పల మార్పిడి శస్త్రచికిత్సలో అరుదైన ఘనత సాధించారు. ఆస్పత్రిలో ఇప్పటి వరకు 40 తుంటి ఆపరేషన్లను ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ చైతన్య విజయవంతంగా పూర్తిచేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందిస్తున్నందుకు శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరద్‌ను బీసీ జేఏసీ నాయకులు దాసరాజు జయరాజు, చేగొండి మురళియాదవ్, సురేష్, సుదర్శన్ సన్మానించారు. ఇదే తరహాలో మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఆస్పత్రిలోని అన్నివిభాగాల్లో అనుభవజ్ఞులైన వైద్యులు పనిచేస్తున్నారని, కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు.

అవసరం మేరకు ఎరువులను వేసుకోవాలి

హాలియా,మే24(ఆంధ్రజ్యోతి): నేలను పరీక్ష చేయించుకొని అవసరం మేరకు ఎరువులు వేసుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ రమ్య తెలిపారు. నల్లగొండ జిల్లా అనుముల మండలం తిమ్మాపురం గ్రామంలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పాలిటెక్నిక్ కంపసాగర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల బృందం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించాలని, అవసరం మేరకు రసాయాలను వినియోగం ద్వారా నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. అలాగే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ పశువ్యాధులు, వాటి నివారణలు, టీకాలు గురించి క్రమం తప్పకుండా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి, అనిత, కళ్యాణ్, వెంకటేశం, రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుడిపై కండక్టర్ ఫిర్యాదు

భువనగిరి టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అసభ్యంగా మాట్లాడిన ప్రయాణికుడిపై మహిళా కండక్టర్ ఫిర్యాదు మేరకు శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణ స్టేషన్‌లో కేసు నమోదైంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి భానుప్రకాష్ స్వగ్రామానికి వచ్చేందుకు మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లో జనగాం డిపో బస్సు ఎక్కాడు. అయితే అప్పటికే ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న బస్సులో తాను దివ్యాంగుడినని తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న ఇతరులను ఖాళీ చేయించి సీటు ఇప్పించాలని కండక్టర్‌తో వాగ్వాదం చేశాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వాదం పెరగడంతో భానుప్రకాష్ మహిళా కండక్టర్‌తో పాటు బస్సులోని మహిళా ప్రయాణికులను అసభ్యంగా దూషించాడు. దీంతో బస్సును నేరుగా భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపి భానుప్రకాష్‌పై మహిళా కండక్టర్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అప్పులు తీసుకొని వ్యాపారి పరారీ

● బాధితురాలి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న సరిత

భువనగిరి టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యాపార కుటుంబం పలువురి వద్ద అప్పులు చేసి తీర్చలేక పరారైన ఘటన శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో వెలుగుచూసింది. దీంతో అప్పు ఇచ్చిన ఓ మహిళా ఆత్మహత్యకు యత్నించగా పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం అనిగిరి అవినాష్ భువనగిరిలోని ఠాగూర్ రోడ్డులో రుద్ర డ్రై ఫ్రూట్స్ పేరిట వ్యాపారం చేస్తున్నారు. డ్రై ఫ్రూట్స్, మసాలాల ప్యాకింగ్ ఇతర పనుల కోసం అతడి వద్ద ఏడుగురు మహిళలు పనిచేస్తున్నారు. దీంతో వారందరినీ నమ్మబలికి వారి సొంత పైసలతోపాటు వారికి తెలిసిన వారి దగ్గర సుమారు రూ.30 లక్షలకు పైగా అప్పులు తీసుకున్నాడు. ఈ క్రమంలో తోట సరిత అనే కార్మికురాలు సొంతంగా రూ.2.40 లక్షలు, మరో రూ.లక్ష ఇతరుల నుంచి అవినాష్‌కు అప్పుగా ఇప్పించింది. కానీ అతను తిరిగి ఇవ్వగపోగా మూడు రోజుల నుంచి ఇంటికి తాళం ఉండటం, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో, రూ.లక్ష ఇచ్చిన వారు ఫోన్ చేస్తుండటంతో ఆందోళనకు గురైన సరిత శనివారం ఇంటిలోని క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరించారు. అయితే ఇటీవల విడాకులు తీసుకున్న మరో కార్మికురాలి పుస్తెలతాడును కూడా అతడు తీసుకొని తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకున్నట్టు తెలిసింది. అలాగే పలువురి నుంచి చిట్టీలు, అప్పులు, ఫైనాన్స్ పేరిట భారీ మొత్తంలో అప్పులు చేసిన కుటుంబం గుట్టు చప్పుడు కాకుండా మూడు రోజుల క్రితం పరారైందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు న్యాయం చేయాలని పోలీసులకు ఆశ్రయిస్తున్నారు. అయితే మోసపోయిన వారందరూ పోలీసులకు ఫిర్యాదులు చేయడం లేదా పరారైన అవినాష్ పట్టుబడడం, తిరిగి వస్తేనే అప్పుల, బాధితుల వివరాలు తేలుతాయని పలువురు అంటున్నారు. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ తెలిపారు.

నకిలీ బంగారం విక్రయించిన వ్యక్తి రిమాండ్

మేళ్లచెర్వు, మే 24(ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు బంగారం విక్రయిస్తామని నకిలీ బంగారం విక్రయించిన వ్యక్తినిపోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం, చిక్‌బలాపూర్‌లోని అక్కిబక్కి కాలనీకి చెందిన హెచ్‌ఆర్ అశోక్ గత నెల 20వ న సూర్యాపేట జిల్లా మేళ్ల చెర్వు మండల కేంద్రంలోని పొలాల వద్ద తాను ఏపీలోని అనంతపూర్‌కు చెందిన వ్యక్తిని అని బురక పిట్టలు పట్టుకొని జీవిస్తుంటానని స్థానికులకు పరిచయం చేసుకున్నాడు. స్థానికుల ఫోన్ నంబర్లు సేకరించి గత నెల 28న తన బంధువు ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా చేస్తుండగా పొలంలో బంగారం దొరికిందని, తక్కువ ధరకు విక్రయిస్తామని మండల కేంద్రానికి చెందిన ఇరిగిల శంభిరెడ్డి, చింతరెడ్డి రామ్‌రెడ్డిని నమ్మించాడు. అనంతపూర్ రావాల్సిందిగా పదే పదే కోరటంతో ఏప్రిల్ 30న శంభిరెడ్డి, రామిరెడ్డి అనంతపురం వెళ్లగా శాంపిల్‌గా గ్రాము బంగారాన్ని ఉచితంగా ఇచ్చాడు. దానిని స్థానికంగా పరిక్షించగా మేలిమి బంగారంగా తేలడంతో ఈ నెల 6న హిందూపూర్ వెళ్లి రూ. 3లక్షలతో సుమారు 500 గ్రాముల బంగారు గొలుసు కొనుగోలు చేశారు. అనంతరం దానిని స్థానికంగా పరిశీలించగా నకిలీ బంగారం అని తేలడంతో తాము మోసపోయామని, ఈ నెల 13వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం మండల కేంద్రంలో సాధారణ తనిఖీల్లో నిందితుడు అశోక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి కొంత నగదును రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఆత్మకూర్(ఎస్), మే 24(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని రామన్నగూడెం గ్రామంలో వీరబోయిన శ్రీనివాస్‌కు చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందింది. మేతకు వెళ్లి వస్తూ తెగి వేలాడుతున్న విద్యుత్ తీగ తగలడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. దాని వెంట ఉన్న మరో ఎద్దు ప్రమాదం నుంచి తప్పించుకుంది.

యాద'గిరి'పై భక్తుల కిటకిట

● శాస్త్రోక్తంగా నిత్యపూజలు
● నిత్య ఆదాయం రూ.49.77లక్షలు


గర్భాలయంలో ఉభయ క్యూలైన్లల్లో భక్తులు

యాదగిరిగుట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం వారాంతపు రద్దీ కనిపించింది. ఇష్టదైవాలను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో యాదగిరికొండ కిటకిటలాడింది. ఉభయ క్యూలైన్లలో రాత్రి వరకు భక్తులు బారులుతీరారు. ఉదయం, సాయంత్రం, మధ్యాహ్నం మహారాజభోగం సమయాలు కలిపి సుమారు మూడు గంటల పాటు ధర్మదర్శన క్యూకాంప్లెక్స్‌లో భక్తులు వేచి ఉన్నారు. గర్భాలయంలో స్వయంభువులకు దర్శించుకున్న భక్తులు ఆలయ ముఖమండపంలో ఉత్సవమూర్తుల వద్ద ప్రత్యేకపూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వాహనాలపై రాగా కొండపైన పార్కింగ్ స్థలం నిండింది. కొండపైన వాహనాల రద్దీతో భక్తుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. స్థలం లేదని దర్శనాలు ముగిసిన భక్తులు కొండ దిగాల్సిందిగా ఆలయ అధికారులు మైక్‌లో భక్తులను కోరారు. ఆర్టీసీ బస్సులు ఒకేసారి వచ్చి వెళ్లడం, రద్దీకి తగ్గట్టు బస్సులు అందుబాటులో లేవు. దీంతో బస్టాండ్‌లో గుంపులు గుంపులుగా బస్సుల కోసం భక్తులు ఉరుకులు పరుగులు పెట్టగా సీట్ల కోసం భక్తులు (ప్రయాణికులు) పోటీపడ్డారు. ఉభయ దర్శన క్యూలైన్లు, బస్టాండ్‌లో వేచి ఉన్న మహిళలు, చంటిపిల్లల తల్లులు, వృద్ధులు రద్దీతో ఇబ్బందులు పడ్డారు. సుమారు 45వేల మంది భక్తులు దర్శించుకోగా ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.49,77,624 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా యాదగిరి కొండపై హరిహరులకు శాస్త్రోక్తంగా నిత్యపూజలు కొనసాగాయి. కాగా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పెళ్లి రోజు సందర్భంగా కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయంలో రూ. 2.50 లక్షలవిలువైన వెండి గదను అందజేశారు. వీటిని స్వామివారి జోడు సేవల్లో వినియోగించనున్నారు. ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ప్రధానార్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు, ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, పర్యవేక్షకుడు నాగుల మహేష్ స్వీకరించగా స్థానికుడు వడ్లోజు వెంకటేష్ ఉన్నారు.


ఆలయ డీఈవో భాస్కరశర్మ, ఏఈవో నవీన్‌కుమార్‌శర్మకు వెండి గదలను అప్పగిస్తున్న చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

మట్టపల్లిలో నృసింహుడి కల్యాణం

మఠంపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యశాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాసన అనంతరం స్వామివారికి మాంగాళ్య ధారణ తలంబ్రాలుతో నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి చెన్నూరిమట్టపల్లిరావు, ఈవో సిరికొండన వీన్ అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి,సీతరామశాస్త్రీ, శేషగిరిరావు, శ్రీనివాసరావు, సీత, రాజష్, రమేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

30న బహిరంగా వేలం..

మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో ఈనెల 30 శుక్రవారం నాడు తలనీలాలు సేకరించుకునే హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఆలయ ఈవో సిరికొండా నవీన్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు స్వామి వారి పేరున రూ.4లక్షలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని కోరారు.

బతుకులో తీపి లేదు.. కారమే మిగిలింది

● మిల్లు నడిస్తినే ఇల్లు గడిచేది ● ఎండాకాలం వస్తే ఏడుపొస్తది

(5వ పేజీ తరువాయి)

పటిష్ఠమైన సిమెంట్ ఫ్లాట్‌ఫాం నిర్మించాలి. రోకళ్లు దిగేలా రాతితో గుంతలను ఏర్పాటు చేయాలి. ఎండు మిర్చిని దంచే సమయంలో రోకళ్ల నుంచి కర్ణభేరి అదిరేలా పెద్దగా శబ్దం వస్తుంది. ఆ సమయంలో మిర్చి దంచే పనిలో ఉన్న వారికి ఏదైనా చెప్పాలనుకుంటే వారి వద్దకు వచ్చి చెవిలోనే చెప్పాల్సి వచ్చేది. ఇప్పటికీ మిర్చిని పట్టించాలంటే అలాంటి రోకళ్లు ఉన్నా వాడే విధానంలో కొంత మార్పు వచ్చింది.

ఎండాకాలం వస్తే ఏడుపొస్తది



కారం గిర్నిని నడపడమంటే అంత సులువుకాదు. ఎండా కాలం వచ్చిందంటే అనుభవించే ఇబ్బందితో ఒక్కోసారి ఏడుపొస్తది. మిర్చి దంచుతుంటే వచ్చే కారం దూళి కంటిలో, ఒంటిపై పడి చెమట ద్వారా ఒళ్లంతా పాకి మంటలు పుడతాయి. రోజుకు రెండు సార్లు స్నానం చేసినా మంటలు తగ్గవు. రాత్రిళ్లు సరిగా నిద్రకూడా రాదు. ఊపిరి తీసుకోవటంలో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. అయినా జీవనోపాధి కోసం తప్పటం లేదు. పిండి మర ఆడితేనే, కారం రోకళ్ల చప్పుడవుతేనే మా కుటుంబం గడుస్తది. 12 ఏళ్ల కిందట మా స్వగ్రామం ఎన్నారంలో కూలీ నాలీ పనులు చేసుకునేదాన్ని. నా భర్త లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. కానీ కంటి చూపు కనపడక డ్రైవింగ్ వృత్తిని మానేశాడు. దీంతో కారం మిల్లును నడుపుకుంటున్నా. ప్రమాదకరమైన చేతివృత్తులను చేస్తున్న వారికి మాదిరిగానే కారం మిల్లు నడిపే వారికి పెన్షన్ ఇస్తే బాగుండు.

- ఏనుగు పద్మ, కారం మిల్లు నిర్వాహకురాలు, నార్కట్‌పల్లి

ఇంటి వద్దే ఉపాధి ఉంటుందని...



ఎవరి వద్దో లేక ఎక్కడికో వెళ్లి పనిచేయడం కంటే ఇంటి వద్దే ఉండి ఉపాధి చూసుకోవచ్చన్న ఉద్దేశంతో నాలుగేళ్లుగా కారం మిల్లును నడుపుతున్నా. ఇంతకు ముందు రోజువారీ కూలీ పనులు చేసినా పెద్దగా గిట్టుబాటు లేదు. దీనికి తోడు మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యంలో ఆటో నడుపుకునే నా భర్తకు ఉపాధి కొరవడింది. దీంతో కుటుంబం నడవటం కోసం తప్పనిసరై కారం మిల్లును నడపాల్సి వస్తోంది. కారం దంచేటప్పుడు ఎంత జాగ్రత్తలు పాటించినా కొన్నిసార్లు ఇబ్బంది పడాల్సి వస్తుంది. దీంతో ఒక్కోసారి ఈ ఉపాధిని ఎందుకు ఎంచుకున్నానా అనిపిస్తుంది. వేసవి తప్ప మిగతా సీజన్‌లో పెద్దగా గిరాకీ ఉండదు. గిరాకీ ఉన్న వేసవిలో అటు ఉష్ణోగ్రత, ఇటు కారం వేడి మంటలతో ఎవరికీ చెప్పుకోలేని అవస్థలు పడతాం. వినియోగదారులు కూడా మా శ్రమను, ఇబ్బందులను గుర్తించి బేరమాడకుండా సహకరించాలి.

- కట్టంగూరు లలిత, కారం మిల్లు నిర్వాహకురాలు, నార్కట్‌పల్లి

చర్మ సమస్యలు వచ్చేందుకు అవకాశం



కారం మిల్లుల్లో పనిచేసే వ్యక్తులకు మిరప పొడి కారణంగా ఎక్కువగా చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఒంటిపై రాషెస్ ఏర్పడి దురద రావడం, కారం ధూళితో గొంతు బొంగురుపోవడం వంటివి జరుగుతాయి. కంటిలో పరమాణువులాంటి కారం దూళి పడి కన్ను ఎర్రగా మారడం, కంటి కలకలు రావడం, ఉబ్బడం, నీరు కారడం వంటివి జరుగుతాయి. కొన్ని సమయాల్లో ఒళ్లు ఉబ్బిపోవడానికి కూడా అవకాశం ఉంటుంది. కారం వేడితో ఒక్కోసారి శరీరం డీహైడ్రేట్ బారిన కూడా పడవచ్చు. ఇలాంటి వాటి బారిన పడకుండా ఉండాలంటే జాగ్రత్తలు పాటించడంలో నిర్లక్ష్యం వహించకూడదు. కళ్లకు పూర్తికవచంగా ఉండే కంటి అద్దాలను వాడాలి. కారం ధూళిని ముక్కు, కన్ను, చెవుల్లోకి వెళ్లకుండా మాస్కులు ధరించాలి. ఒంటికి కూడా పూర్తి రక్షణనిచ్చే ఆర్పాన్‌ను వేసుకోవాలి. చేతులకు భుజాల వరకు వచ్చేలా రబ్బరు గ్లౌజ్‌ను వాడాలి. విధిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలి.

- డాక్టర్ ఏ.ఎస్.కే.మనోజ్, ఎండీ,
జనరల్ మెడిసిన్, కిమ్స్, నార్కట్‌పల్లి

ఉపాధ్యాయులకు ఆదర్శం

● కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన టీచర్


ఎంఈవో శాంతయ్య సమక్షంలో తన కుమారునికి ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకుంటున్న ప్రశాంతి

తిరుమలగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆదర్శంగా నిలిచింది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల క్రాస్‌రోడ్‌లో గల ప్రాథమిక పాఠశాలలో దొంగరి ప్రశాంతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తన కుమారుడు రిషిని తిరుమలగిరిలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పించింది. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉండాలని, అందుకే తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. ఎంఈవో శాంతయ్య, పలువురు ఉపాధ్యాయులు ప్రశాంతిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం అశోక్‌రెడ్డి, టీచర్లు కవిత, సత్యనారాయణ, వెంకటరామనర్సయ్య, సౌమ్యబాయి, గిరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట ఏసీపీగా శ్రీనివాస్‌నాయుడు



యాదగిరిగుట్ట రూరల్, మే 24, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ఏసీపీగా శ్రీనివాస్‌నాయకుడు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు బాధ్యతలు నిర్వహించిన రమేష్‌కుమార్ డీజీపీ కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో శ్రీనివాస్‌నాయుడు వచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందిస్తానని, గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, యువతకు కౌన్సిలింగ్ నిర్వహించి నివారించడానికి కృషి చేస్తానని తెలిపారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌కు గాయాలు

భువనగిరి రూరల్, మే24(ఆంధ్రజ్యోతి): అజాగ్రత్తతతో బస్సును రివర్స్ గేర్‌లో వస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన భువనగిరి మండలం అనంతారం శివారులోని ఆర్టీవో కార్యాలయ ఆవరణలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామానికి చెందిన కొండ్ర భాను ఏపీ 39 డబ్ల్యూబీ 1418 నెంబర్ గల ట్రావెల్ బస్సు స్థానికంగా ఆర్టీవో కార్యాలయానికి తీసుకొస్తున్న క్రమంలో రివర్స్ గేర్ వేసి, పార్కింగ్ చేస్తున్న క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు బస్సుకు ఆనుకున్నాయి. పరిస్థితిని గమనించి డ్రైవర్ భాను వెంటనే కిందకి దూకేశాడు. విషయం తెలుసుకున్న డీటీవో సాయికృష్ణ పోలీసులకు సమాచారం ఇచ్చి గాయపడిన బస్సు డ్రైవర్ భానును 108 అంబులెన్స్‌లో భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకవెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు తెలిపారు. కాగా ఈ ఘటనపై జిల్లా రవాణాశాఖ అధికారి సాయికృష్ణను సంప్రదించగా సదరు వ్యక్తి కార్యాలయానికి ఏ పని కోసం వచ్చాడో తమకు సమాచారం లేదని, అయినప్పటికీ ప్రమాదం జరిగిన వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

పాలిసెట్‌లో కోదాడ విద్యార్థినికి 3వ ర్యాంకు


ఎస్‌కే ఇఫ్రా


గీతిక

కోదాడటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు 2025 పరీక్షలో జయ స్కూల్ కోదాడకు చెందిన ఎస్‌కె ఇఫ్రా తస్నీమ్ రాష్ట్రంలో 3వ ర్యాంకు రాష్ట్రస్థాయిలో సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ జయా వేణుగోపాల్ తెలిపారు. ర్యాంకు సాధించిన విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, హెచ్ఎం చిలువేరు వేణు అభినందించారు. పాఠశాల స్థాయిలో జరిగే అత్యుత్తమ ఫౌండేషన్ విద్య ద్వారా అన్ని పోటీ పరీక్షలలో విజయం సాధించగలుగుతున్నారని కరస్పాండెంట్ తెలిపారు. ఈ విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులకు సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.


వైష్ణవి

● భువనగిరిటౌన్ : పాలిసెట్ ఫలితాల్లో భువనగిరి ప్రశాంతి స్కూల్ విద్యార్థిని తోటకూరి వైష్ణవి రాష్ట్రస్థాయిలో మెరిసింది. బైపీసీ విభాగంలో 29వ, ఎంపీసీ విభాగంలో 75వ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించింది. ఇటీవల వెల్లడించిన టీజీ ఆర్‌జేసీ సెట్ ఫలితాల్లో వైష్ణవి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించిన విషయం విదితమే. అలాగే అదే పాఠశాలకు చెందిన అర్పిత్‌యాదవ్ 570వ ర్యాంకు సాధించాడు. విద్యార్థులను ప్రిన్సిపాల్ యాదయ్య అభినందించారు.

● భూదాన్‌పోచంపల్లి: భూదాన్ పోచంపల్లి పట్టణ పరిధిలోని మక్తాపూర్‌కు చెందిన జూలూరు గీతిక పాలిసెట్‌లో 505 మార్కులతో 471 ర్యాంకును సాధించారు. పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్ విద్యార్థిని గీతిక ఇటీవల ఎస్సెస్సీ పరీక్ష ఫలితాల్లో 563 మార్కులు సాధించి మం డల ద్వితీయ ర్యాంకు సాధించారు. టీ జీఆర్‌జేసీ ఎంట్రెన్స్ టెస్ట్‌లోనూ ఆమె 96మార్కులతో 246వ ర్యాంకు సాధించి ప్రతిభను చాటుకున్నారు. గీతికను తల్లిదండ్రులు కరస్పాండెంట్ ఎస్.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నామని భాస్కర్ అభినందించారు.

● యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా వ్యాప్తంగా 1664 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా జిల్లాలో ఎంపీసీ, ఎంసీసీ స్ట్రీమ్‌ల్లో వరుసగా 3ర్యాంకులు 24వ ర్యాంకు గొట్టిపాముల సాయి, మేఘన, తోటకూరి వైష్ణవి 75వ ర్యాంకు, 222వ ర్యాంకు సారాబాబు, సాయినీరజ్, ఎంబీసీ (ఎంబైపీసీ)లో జిల్లాలో తోటకూరి వైష్ణవి 15వ ర్యాంకు, తోటకూరి వైష్ణవి 29వ ర్యాంకు, 60వ ర్యాంకు జి.దీపిక సాధించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీసీ స్ట్రీమ్‌లో 80.95 శాతం, ఎంబీపీసీలో 83.17 శాతం సాధించినట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఫ్యాన్సీ నెంబర్ కోసం రూ.3,50,999

● టీజీ 29 ఏ 9999 నంబర్ కైవసం చేసుకున్న సూర్యాపేట జిల్లా వాసి


రామినేని శ్రీనివాసరావు

కోదాడటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్సీ నెంబర్ కోసం రూ.3.50లక్షలు ఖర్చు చేసి సొంతం చేసుకున్నాడు సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణవాసి. కోదాడ పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు ఇటీవల నూతనంగా కొనుగోలు చేసిన తన టయోటా ఫార్చ్యూనర్ లెజెండ్ కారు నెంబర్ కోసం ఏకంగా రూ.3.50లక్షలు ఖర్చు చేశారు. శనివారం కోదాడ మో టార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో టీజీ29ఏ 9999 నెంబర్‌కు రికార్డు స్థా యిలో 3,50,999 ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి చెల్లించి తనకు నచ్చిన నెంబర్‌ను దక్కించుకున్నారు.

భువనగిరిలో విస్తృత తనిఖీలు

భువనగిరి టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : భారత్-పాకిస్తాన్ మధ్య నెలకొన్న వివాదం, బాంబులు అమర్చామంటూ వివిధ ప్రాంతాలకు ఫోన్‌కాల్స్ వస్తున్న నేపథ్యంలో శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో డాగ్, బాంబు డిస్పోజల్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. బస్టాండ్, రైల్వేస్టేషన్, చౌరస్తాలు, పలు వస్త్ర ఇతర దుకాణాల్లో వస్తువులు, ప్యాకింగ్స్‌ను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపైన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేసమయంలో నిర్ధారణ పేరిట ప్రజలు ఎవరూ సొంత నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసు అధికారులు తెలిపారు. సాధారణ తనిఖీలేనని పోలీసులు తెలిపారు. కానీ ఆకస్మాత్తుగా చేపట్టిన తనిఖీలతో ప్రజలు మొదటగా కాస్త ఆందోళనకు గురైనా ఆ తర్వాత తేరుకొని పోలీసులకు సహకరించారు.


భువనగిరి బస్టాండ్‌లో తనిఖీలు

నేడు ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ పోటీలు

సూర్యాపేటటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-11, 17 బాల, బాలికలకు చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు సెల్: 9394753343లో సంప్రదించాలని కోరారు.



ఫైనల్‌కు శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్

కౌలాలంపూర్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. అప్పుడెప్పుడో 2019లో ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఆరేళ్ల తర్వాత ఓ బీడబ్ల్యూఎఫ్ టూర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరాడు. ఫామ్‌లేమికి చెక్ పెడుతూ, తన జోరు కొనసాగిస్తూ కిడాంబి.. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్‌ఫైట్‌కు దూసుకెళ్లాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో 32 ఏళ్ల శ్రీకాంత్ 21-18, 24-22తో జపాన్‌కు చెందిన యుషి తనకను ఓడించాడు. ఆదివారం జరిగే తుదిపోరులో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

పంజాబ్‌కు పంచ్

విజయంతో ఢిల్లీ బైబై

రాణించిన సమీర్ రిజ్వీ • ముస్తాఫిజుర్‌కు 3 వికెట్లు



సమీర్ రిజ్వీ (58 నాటౌట్)

జైపూర్: టాప్-2లో నిలిచేందుకు పోటీపడుతున్న జట్లకు వరుసగా మూడో రోజూ ప్రతికూల ఫలితమే ఎదురైంది. గుజరాత్, బెంగళూరు తరహాలోనే తాజాగా పంజాబ్ కింగ్స్‌కు పంచ్ పడింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి తప్పుకొన్న ఢిల్లీ క్యాపిటల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టింది. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్‌పై శనివారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 15 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. భారీ ఛేదనలో సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53), స్టొయినిస్ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 44 నాటౌట్), ఇన్‌గ్లిస్ (12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. ముస్తాఫిజుర్‌కు 3.. విప్రజ్, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాహుల్ (35), డుప్లెసి (23) తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఆ తర్వాత కరుణ్ నాయర్ (44) భారీ షాట్లతో విరుచుకుపడగా.. డెత్ ఓవర్లలో సమీర్ రిజ్వీ పంజాబ్ బౌలర్లను ఆడుకున్నాడు. అతడికి స్టబ్స్ (18 నాటౌట్) సహకరించడంతో ఢిల్లీ ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. చివరి ఓవర్‌లో 8 పరుగులే అవసరమవగా, రిజ్వీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. హర్‌ప్రీత్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సమీర్ రిజ్వీ నిలిచాడు.

స్టొయినిస్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయాస్ నిలకడతో పాటు ఆఖర్లో స్టొయినిస్ జోరుతో జట్టు 200 దాటింది. ఓపెనర్ ప్రియాన్ష్ (6) విఫలమైనా ప్రభ్‌సిమ్రన్-ఇన్‌గ్లిస్ జోడీ చెలరేగింది. ఆరో ఓవర్‌లో 6,4 బాది ఇన్‌గ్లిస్ అవుటైనా పవర్‌ప్లేలో జట్టు 60/2 స్కోరు సాధించింది. రెండో వికెట్‌కు వీరు 47 పరుగులు జత చేశారు. విప్రజ్ బౌలింగ్‌లో స్కూప్ షాట్‌కు వెళ్లి ప్రభ్‌సిమ్రన్ బౌల్డయ్యాక ఆటలో కాస్త వేగం తగ్గింది. అయితే శ్రేయాస్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. నేహల్ (16), శశాంక్ (11) విఫలమైనా కెప్టెన్‌కు స్టొయినిస్ సహకరించాడు. 17వ ఓవర్‌లో అతడి 6,6,4.. శ్రేయాస్ 4తో 25 పరుగులు వచ్చాయి. కానీ కుల్దీప్ ఒకే ఓవర్‌లో శ్రేయాస్, అజ్మతుల్లా (1) వికెట్లు తీశాడు. అయినా 19వ ఓవర్‌లో మరోసారి చెలరేగిన స్టొయినిస్ 6,4,4,6తో 22 రన్స్ రాబట్టాడు. ముస్తాఫిజుర్ ఆఖరి ఓవర్‌లో పది పరుగులే ఇచ్చి జాన్సెన్ (0)ను అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 6, ప్రభ్‌సిమ్రన్ (బి) విప్రజ్ 28, ఇంగ్లిస్ (స్టంప్డ్) స్టబ్స్ (బి) విప్రజ్ 32, శ్రేయాస్ (సి) మోహిత్ (బి) కుల్దీప్ 53, నేహల్ (సి) డుప్లెసి (బి) ముకేశ్ 16, శశాంక్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 11, స్టొయినిస్ (నాటౌట్) 44, అజ్మతుల్లా (సి) రిజ్వీ (బి) కుల్దీప్ 1, జాన్సెన్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 0, హర్‌ప్రీత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/8, వికెట్ల పతనం:** 1-8, 2-55, 3-77, 4-118, 5-144, 6-172, 7-174, 8-197; బౌలింగ్: ముకేశ్ 4-0-49-1, ముస్తాఫిజుర్ 4-0-33-3, మోహిత్ శర్మ 4-0-47-0, విప్రజ్ 4-0-38-2, కుల్దీప్ 4-0-39-2.

ఢిల్లీ: రాహుల్ (సి) శశాంక్ (బి) జాన్సెన్ 35, డుప్లెసి (సి) ప్రియాన్ష్ (బి) హర్‌ప్రీత్ 23, కరుణ్ నాయర్ (బి) హర్‌ప్రీత్ 44, అటల్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రవీణ్ దూబే 22, సమీర్ రిజ్వీ (నాటౌట్) 58, స్టబ్స్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-55, 2-65, 3-93, 4-155; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-0, అజ్మతుల్లా 4-0-46-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-41-2, జాన్సెన్ 4-0-41-1, ప్రవీణ్ దూబే 2-0-20-1, స్టొయినిస్ 1.3-0-21-0.

నేటి మ్యాచ్‌లు

గుజరాత్ x చెన్నై — మ.3.30 నుంచి — వేదిక: అహ్మదాబాద్

హైదరాబాద్ x కోల్‌కతా — రా.7.30 నుంచి — వేదిక: ఢిల్లీ

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.737
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర.రే: నెట్ రన్‌రేట్

టెస్టుల్లో కొన్నేళ్లుగా జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్, కోహ్లీ ఒక్కసారిగా గుడ్‌బై చెప్పడంతో.. సంధి దశలో ఉన్న టీమిండియాను నడిపించే నవతరం నాయకుడిగా శుభ్‌మన్ గిల్ సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాడు. యువ సారథిగా భవిష్యత్ భారత జట్టును నిర్మించనున్నాడు. ఇంగ్లండ్ టూర్‌లో గిల్ నూతన ప్రస్థానం ఆరంభం కానుంది. ఐపీఎల్‌లో అదరగొడుతున్న సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి రెడ్‌బాల్ జట్టులో చోటు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్‌కు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.



నవతరం నాయకుడు వచ్చాడు

శుభ్‌మన్ గిల్‌కే టెస్టు జట్టు పగ్గాలు

సుదర్శన్, అర్ష్‌దీప్‌కు పిలుపు

- వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్
- బుమ్రా ఆడేది కొన్ని మ్యాచ్‌లే
- ఫిట్‌నెస్ లేమితో షమి అవుట్



అర్ష్‌దీప్



సుదర్శన్

ముంబై: రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత జట్టు పగ్గాలు అందుకొనేది ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఊహాగానాలకు తగినట్టుగానే భారత టెస్టు జట్టు కొత్త కొప్టెన్‌గా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. వచ్చేనెల 20 నుంచి జరిగే ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించే టీమిండియాను శనివారం సెలెక్టర్లు ప్రకటించారు. డాషింగ్ బ్యాటర్, 27 ఏళ్ల రిషభ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత సంధి దశలో ఉన్న భారత జట్టుకు అంతగా అనుభవం లేని 18 మంది సభ్యుల జట్టును సెలెక్టర్లు ఎంపిక చేసి ఒకరకంగా సాహసమే చేశారు. 32 టెస్టులు ఆడిన గిల్ 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. కాగా, ఈ పర్యటన నుంచి పెద్దగా ఆశిస్తున్నదేమీ లేని నేపథ్యంలో గిల్ సాధించే అనుభవం భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని సెలెక్టర్లు చెబుతున్నారు. 'ఏడాది క్రితమే గిల్‌పై దృష్టిసారించాం. భవిష్యత్‌లో భారత జట్టును నడిపించగల సామర్థ్యం అతడిలో ఉందని భావించాం' అని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కాగా, సుదీర్ఘ సిరీస్‌కు ఫిట్‌గా ఉండడన్న కారణంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమిని జట్టు నుంచి తప్పించారు. అయితే, వైద్యుల సూచనల మేరకు షమిని పరిగణనలోకి తీసుకోలేదని అగార్కర్ తెలిపాడు. అతడి స్థానంలో ఐపీఎల్‌లో అదరగొ డుతున్న అర్ష్‌దీప్ సింగ్‌ను తొలిసారి టెస్టులకు ఎంపిక చేసినట్టు చెప్పా డు. 'ఐపీఎల్ సందర్భంగా గతవారం గాయానికి గురైన షమి ఇటీవలే ఎంఆర్ఐ స్కాన్ తీయించుకొన్నాడు. అయితే, సిరీస్‌కు అతను ఫిట్‌గా ఉండడని వైద్యులు తేల్చారు' అని అగార్కర్ తెలిపాడు. మొత్తంగా టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ (2025-27) కోసం భారత జట్టు నిర్మాణం ఇంగ్లండ్ సిరీస్‌తో ఆరంభమవుతుంది. గిల్ భారత టెస్టు జట్టుకు 37వ కెప్టెన్.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.



నాయర్.. 8 ఏళ్ల తర్వాత

రోహిత్, కోహ్లీ స్థానాల్లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ జట్టులోకొచ్చారు. ఈ ఐపీఎల్‌లో పరుగుల వరదపారిస్తున్న గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు తొలిసారి పిలుపు అందగా.. ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ రీఎంట్రీ ఇచ్చాడు. ఈ ఐపీఎల్‌లో సుదర్శన్ 638 రన్స్ చేసి టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. ఇక, నాయర్ చివరిసారిగా 2017లో టెస్టు ఆడాడు. సెహ్వాగ్ తర్వాత టీమిండియాలో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కిన కరుణ్.. ఆ తర్వాత అంతగా ఆకట్టుకోలేకపోయాడు. కానీ, దేశవాళీలో మెరుగైన ప్రదర్శనతో సెలెక్టర్ల తలుపులు తడుతూనే ఉన్నాడు. అయితే కోహ్లీ రాజీనామాతో నాయర్‌కు అదృష్టం కలిసొచ్చింది. పేసర్ హర్షిత్ రాణా, బ్యాటర్లు శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌లకు జట్టులో చోటు దక్కలేదు. అయితే, సర్ఫరాజ్‌కంటే అనుభవజ్ఞుడైన నాయర్‌కు సెలెక్టర్లు ఓటేశారు. ఆస్ట్రేలియా టూర్‌లో ఆడిన దేవ్‌దత్ పడిక్కల్ ఫిట్‌నెస్ సమస్యలతో చోటు కోల్పోయాడు.



5

పిన్న వయసులో భారత టెస్టు జట్టు సారథిగా ఎంపికైన ఐదో ఆటగాడు గిల్ (25 ఏళ్ల 258 రోజులు). మన్సూర్ అలీఖాన్ పటౌడి (21 ఏళ్లు), సచిన్ (23 ఏళ్లు), కపిల్ దేవ్ (24 ఏళ్లు), రవిశాస్త్రి (25 ఏళ్ల 229 రోజులు).. గిల్ కంటే ముందున్నారు.



బుమ్రాకు ఎందుకు వద్దంటే..?

కెప్టెన్సీ కోసం గిల్‌తోపాటు బుమ్రా పేరు గట్టిగానే వినిపించింది. అయితే, ఫిట్‌నెస్ ఇబ్బందుల కారణంగానే బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించలేదు. అసలు సిరీస్‌లోని ఐదు టెస్ట్‌లకు బుమ్రా అందుబాటులో ఉండడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. బుమ్రాపై పని ఒత్తిడి భారం పడకుండా చూడాలని ఫిజియో, వైద్యులు సూచించారు. ఈ క్రమంలో బుమ్రా రెండు, మూడు టెస్టులకే అందుబాటులో ఉండే అవకాశాలున్నాయని అగార్కర్ పేర్కొన్నాడు. రిజర్వ్ ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేశారు. అయితే, బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ సామర్థ్యంపై సందేహాలుండడంతో.. శార్దూల్ ఠాకూర్‌కు కూడా జట్టులో చోటిచ్చారు. శార్దూల్ చివరిగా 2023లో టెస్టు ఆడాడు. గత ఇంగ్లండ్ పర్యటనలో ఓవల్ టెస్ట్‌లో శార్దూల్ వరుసగా అర్ధ శతకాలు బాదడంతో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఇక 'శుభ్' ఆరంభం!

టెస్టుల్లో రోహిత్ వారసుడిగా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు అప్పగించారు. భారత క్రికెట్‌కు వెన్నెముకగా నిలిచిన విరాట్, రోహిత్ దూరమైన వేళ ఈ సంధి దశను అధిగమించేందుకు బీసీసీఐ ఈ యువ ఆటగాడిపై భరోసా ఉంచడం విశేషమే. అరంగేట్రం చేసిన ఐదేళ్లకే కెప్టెన్‌గా అందలం దక్కడంతో గిల్ కెరీర్ గ్రాఫ్‌ను నెటిజన్లు కొనియాడుతున్నారు. 2018 అండర్-19 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీతో గిల్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. అప్పటి కోచ్ ద్రవిడ్ పట్టుబట్టి మరీ గిల్‌ను జట్టులోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ టూర్‌లో ఇండియా 'ఎ' తరఫున రాణించాడు. అలాగే వెస్టిండీస్ 'ఎ'తో జరిగిన టెస్టులో డబుల్ సెంచరీతో వెనుదిరిగి చూడలేదు. చక్కటి టెక్నిక్, టెంపర్‌మెంట్ కలిగిన బ్యాటింగ్ కారణంగా 2019లోనే వన్డే జట్టులోకొచ్చాడు. అయితే గిల్ సక్సెస్ వెనుక అతడి తండ్రి లఖ్వీందర్ కృషి ఎనలేనిది. కొడుకు ధ్యాసంతా క్రికెట్‌పైనే ఉండేందుకు తమ గ్రామం నుంచి మొహాలీకి మకాం మార్చాడు. కొన్నేళ్లపాటు బంధువుల వివాహాలకు కూడా హాజరుకాలేదట. అప్పటి త్యాగాలకు ప్రస్తుతం ఘనమైన ప్రతిఫలమే దక్కింది. పాతికేళ్ల వయస్సులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టును నడిపించే స్థాయికి ఎదిగాడు. మరోవైపు ఈ ప్రయాణం సవాళ్లతో కూడుకున్నదే అయినా.. భారత టెస్టు జట్టు గిల్ ఆధ్వర్యంలో శుభ్ ఆరంభంగా కొనసాగాలని ఆశిద్దాం.



ఆ ఇద్దరి లోటు పూడ్చలేనిది: అగార్కర్

జట్టులో రోహిత్, కోహ్లీ లేని లోటును పూడ్చడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. కానీ, రాబోయే ఇంగ్లండ్ టూర్‌లో మిగతా ఆటగాళ్లు ఆ బాధ్యతలు అందుకొంటారని ఆశిస్తున్నట్టు చెప్పాడు. ఈ నెల 7న రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించగా.. 12న కోహ్లీ టెస్టుల నుంచి వైదొలుగుతున్నట్టు బాంబ్ పేల్చాడు. అయితే, చాంపియన్స్ ట్రోఫీ తర్వాత గత నెలలోనే తాను టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలనుకొంటు న్నట్టు కోహ్లీ తనకు చెప్పాడని అగార్కర్ తెలిపాడు.

'25' వేటలో జొకో!

సోనీ లివ్‌లో మ. 2.30 నుంచి

- నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్
- ఫేవరెట్లుగా అల్కారజ్, సిన్నర్



పారిస్: క్లేకోర్ట్ రారాజు రఫెల్ నడాల్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి ఫ్రెంచ్ ఓపెన్‌లో యువ హవా నడవనుంది. డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కరజ్, జానిక్ సిన్నర్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనే అంచనాలున్నాయి. ఆదివారం నుంచి జరిగే టోర్నీలో సిన్నర్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఇక, రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. రోలాండ్ గారోస్‌లోనే ఆ ఫీట్ పూర్తిచేయాలనుకొంటున్నాడు. అయితే, ఆరోసీడ్ జొకోవిచ్, సిన్నర్ ఒకే పార్శ్వంలో ఉండడంతో సెమీస్‌లో ఇద్దరూ తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో మెకెంజీతో జొకో, ఆర్థర్ (ఫ్రాన్స్)తో సిన్నర్ తలపడనున్నారు. క్వాలిఫయర్ జిప్పరీ (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక ఫేవరెట్ కాగా... మూడుసార్లు డిఫెండింగ్ చాంప్ స్వియటెక్, గతేడాది రన్నరప్ పాలినీ, రెండో సీడ్ కొకో గాఫ్ టైటిల్ రేసులో ఉన్నారు.

షూటర్ ముకేశ్‌కు కాంస్యం

సుహ్లా (జర్మనీ): జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముకేశ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో ముకేశ్ మూడోస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ నరేన్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో కాంస్యం నెగ్గాడు.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం

నాటింగ్‌హమ్: జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 45 పరుగుల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ 565/6 వద్ద డిక్లేర్ చేసింది. కాగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. ఆటకు మూడో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 30/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 255 రన్స్‌కు కుప్పకూలింది.

ఖరీదైన బహుమతులు వచ్చాయా...



ఐటీ రిటర్నుల్లో వెల్లడించాల్సిందే..

భారతీయ సమాజంలో బహుమతులు (గిఫ్ట్) ఒక భాగం. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగల సమయంలో బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయం కూడా. ఇవి నగనట్రా, ఆస్తులు లేదా ఇతర విలువైన వస్తువుల రూపంలో ఉంటాయి. ఈ బహుమతులు తీసుకోవటం సంతోషం కలిగించినా.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న బహుమతుల విలువ రూ.50,000 మించితే వాటిపై పన్ను పోటు తప్పదు. ఐటీ రిటర్నులు సమర్పించేటప్పుడు విలువతో సంబంధం లేకుండా ఈ బహుమతుల వివరాలు వెల్లడించడం మంచిది. లేకపోతే భవిష్యత్‌లో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

1958లోనే బహుమతులపై పన్ను కోసం ప్రభుత్వం గిఫ్ట్ ట్యాక్స్ యాక్ట్ తీసుకొచ్చింది. 1998లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. అయితే 2004లో మళ్లీ బహుమతులను ఆదాయ పన్ను (ఐటీ) చట్ట సవరణ ద్వారా పన్నుల పరిధిలోకి తీసుకొచ్చారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం నిర్ణీత విలువ దాటిన బహుమతులు 'ఇతర ఆదాయం' కింది పరిగణించి వాటిని అందుకున్న వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేస్తారు.

వీరికి మినహాయింపు: ఐటీ చట్టంలో పేర్కొన్న దగ్గరి బంధువులు, కుటుంబసభ్యుల నుంచి అందే బహుమతులకు విలువతో సంబంధం లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఇతరుల నుంచి వస్తే: ఎవరైనా ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో బంధువులు కాని వ్యక్తుల నుంచి రూ.50,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు అందితే వారిపై పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు.

ఎవరు బంధువులు: ఐటీ చట్టం ప్రకారం తల్లిదండ్రులు, తోబుట్టువులు, జీవిత భాగస్వాములు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దగ్గరి బంధువుల పరిధిలోకి వస్తారు. వీరి నుంచి మనకి, మన నుంచి వీరికి అందే బహుమతులపై ఎలాంటి పన్ను వర్తించదు.

పన్ను పోటు లేని బహుమతులు

- పెళ్లిళ్ల సమయంలో వధూవరులకు వచ్చే గిఫ్టులు
- ఐటీ చట్టం పేర్కొన్న దగ్గరి బంధువుల నుంచి అందే బహుమతులు
- వారసత్వంగా లేదా వీలునామా ద్వారా సంక్రమించే గిఫ్టులు
- ప్రభుత్వం వద్ద నమోదైన మతపరమైన, దాతృత్వ ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి అందే గిఫ్టులు
- యూనివర్సిటీలు, విద్యా సంస్థల నుంచి అందే ఉపకార వేతనాలు, గ్రాంట్లు, ఆర్థిక సాయం
- మున్సిపల్, స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి అందే బహుమతులు
- కేవలం ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ఏర్పాటైన ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- యాజమాన్య హక్కుల బదిలీ లేకుండా అందే బహుమతులు
- కార్లు, ఫోన్లు, టీవీలు, ఫర్నీచర్, వాచీల వంటి బహుమతుల విలువ రూ.50,000 మించినా పన్ను పోటు ఉండదు.

రిటర్నుల్లో ఎలా వెల్లడించాలి?

ఒక ఆర్థిక సంవత్సరంలో అందే బహుమతుల విలువ రూ.50,000 మించితే తప్పకుండా ఆ విషయాన్ని 'ఇతర ఆదాయం' సెక్షన్‌లో వెల్లడించాలి. ఒకవేళ వాటి విలువ రూ.50,000 కంటే తక్కువగా ఉన్నా 'ఎగ్జెంప్ట్ ఇన్‌కం' సెక్షన్‌లో వెల్లడించడం మంచిది. దీనివల్ల మన ఆదాయ వెల్లడిలో పారదర్శకత పెరిగి ఐటీ శాఖ మన రిటర్నులు స్క్రూటినీ చేసే అవకాశాలు తగ్గుతాయి.

బిజినెస్ ప్లస్

క్రెడిట్ కార్డుతో నగదు తీసుకుంటున్నారా..



తొలి రోజు నుంచే వడ్డీ

జాగ్రత్తలు తీసుకోకపోతే గుదిబండగా మారే ప్రమాదం

ఎప్పుడు ఎవరికి ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. ఆ సమయంలో చేతిలో డబ్బులు ఉంటాయనే గ్యారెంటీ లేదు. అప్పుడు బంధుమిత్రుల నుంచి లేదా బ్యాంకు నుంచి అప్పు చేయక తప్పదు. ఇవేవీ సాధ్యం కాకపోతే క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం ఒక్కటే మార్గం. అయితే ఇది అంత క్షేమం కాదు. ఇందుకు అధిక వడ్డీతో పాటు చార్జీల రూపంలోనూ భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు ద్వారా అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌లో ఉన్న సమస్యలు ఏమిటో తెలుసుకుందాం...

చార్జీలు

క్రెడిట్ కార్డు అంటేనే ఫీజులు, వడ్డీలు. ఇక ఈ కార్డులతో విత్‌డ్రా చేసే అడ్వాన్స్ నగదుపై వడ్డీ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతి నగదు విత్‌డ్రాయల్స్‌పై కనీసం రూ.250 నుంచి రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. విత్‌డ్రా చేసే నగదును బట్టి ప్రతి లావాదేవీ విలువలో ఇది 2.5 శాతం నుంచి 3 శాతం వరకు ఉంటుంది. క్రెడిట్ కార్డు కంపెనీలు జారీ చేసే బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లో ఈ చార్జీల వివరాలు ఉంటాయి.

వడ్డీ రేటు

క్రెడిట్ కార్డుల ద్వారా విత్‌డ్రా చేసే నగదు అడ్వాన్స్‌పై బ్యాంకులు నెలవారీ పద్ధతిలో వడ్డీ రేటు వసూలు చేస్తాయి. సాధారణంగా ఈ వడ్డీ రేటు 2.5 నుంచి 3 శాతం మధ్య ఉంటుంది.


క్రెడిట్ కార్డుపై కొనే వస్తువుల బకాయిలు చెల్లించేందుకు కొంత ఇంటరెస్ట్ ఫ్రీ గడువు ఉంటుంది. అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌కు ఇలాంటి సౌలభ్యం ఉండదు. నగదు విత్‌డ్రా చేసిన రోజు నుంచి చెల్లించే రోజు వరకు వడ్డీ భారం తప్పదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌ను ఎంత త్వరగా చెల్లిస్తే అంత మంచిది.

లేటు చెల్లింపులు వద్దు

ఈ చెల్లింపులను ఒకేసారి వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది. చేతిలో డబ్బులు లేవని కొద్దికొద్దిగా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లిస్తే ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. సాధారణంగా ఇది మిగిలిన బకాయి మొత్తంలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. ఆలస్యంగా చేసే అడ్వాన్స్ నగదు చెల్లింపులు ఆర్థిక భారంతో పాటు క్రెడిట్ స్కోరునూ దెబ్బతీస్తాయి.

పరిమితులు

క్రెడిట్ కార్డు చేతిలో ఉన్నంత మాత్రాన ఎంత పడితే అంత అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్ కుదరవు. మీ క్రెడిట్ కార్డు క్రెడిట్ లిమిట్‌లో ఒక పరిమితికి లోబడి మాత్రమే ఈ నగదు ఉపసంహరణ సాధ్యం. ఒకవేళ దీన్ని ఉపయోగించుకున్నా ఆ మొత్తాన్ని నిర్ణీత గడువు లోగా ఒకేసారి చెల్లించాలి. లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం ఉంది.



ఎల్ఐసీ గిన్నిస్ వరల్డ్ రికార్డు

ఒక్క రోజులో 5,88,107 పాలసీల విక్రయం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఒక్క రోజులో ఇన్ని పాలసీలు అమ్మిన బీమా కంపెనీ ఇదే. ఈ జనవరి 20న సంస్థకు చెందిన 4,52,839 ఏజెంట్లు ఈ పాలసీలను విక్రయించినట్లు ఎల్ఐసీ వెల్లడించింది. "ఇది మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, నైతికతకు బలమైన ధ్రువీకరణ. మా కస్టమర్లు, వారి కుటుంబాలకు బీమా ద్వారా ఆర్థిక రక్షణ కల్పించాలన్న మా లక్ష్యం పట్ల నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది" అని ఎల్ఐసీ పేర్కొంది. 'మ్యాడ్ మిలియన్ డే' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ జనవరి 20న ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీనైనా విక్రయించాలని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి కోరారు. దాంతో ఏజెంట్లందరూ కలిసి రికార్డు స్థాయిలో పాలసీలను విక్రయించారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	510
వరంగల్	502	గోదావరి	485
చిత్తూరు	603	విశాఖపట్నం	513
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,080 ▲	89,900 ▲	1,10,900 ▼
విజయవాడ	99,700 ▲	93,500 ▲	99,700 ▼
విశాఖపట్నం	98,080 ▼	89,900 ▲	1,10,900 ▲
రాజమండ్రి	98,070 ▲	89,900 ▲	1,03,000 ▲
ప్రొద్దుటూరు	96,200 ▼	88,500 ▼	99,200 ▼
ముంబై	95,471	87,451	96,909

ఎంపీఎల్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

చిట్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): చిట్యాల శివారులో గల ఎంపీఎల్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీఎల్ పరిశ్రమ వెదజల్లుతున్న విషవాయువుల వల్ల చిట్యాల పట్టణంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, షరీఫ్, బాలరాజు, శేఖర్‌రెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా శంకర్



నార్కట్‌పల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నార్కట్‌పల్లి మండల కార్యదర్శిగా పల్లెపహాడ్‌కు చెందిన పెండ్యాల శంకర్ ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా పెండ్యాల శంకర్, సహాయ కార్యదర్శులుగా వంగాల నాగయ్య, వనం వాసుదేవులతో పాటు 11 మందిని సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు.

సమాచారం

సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

నల్లగొండరూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): నల్లగొండ మండలంలోని దొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సబ్‌స్టేషన్ పూర్తికాకపోవడంతో సుమారు మూడు, నాలుగు గ్రామాల రైతులు లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వెంటనే సబ్‌స్టేషన్ పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

నార్కట్‌పల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లికి చెందిన మేడబోయిన నాగరాజు సతీమణి నర్సమ్మ మృతి చెందగా మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జెనిగె కనకయ్య, పల్రెపాటి యాదగిరి, మచ్చ అయిలయ్య, జెనిగె సత్తయ్య, రాంబాబు ఉన్నారు.

క్లాస్‌మేట్ కుటుంబానికి సాయం

నార్కట్‌పల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన క్లాస్‌మేట్ కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. రూ.30వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. మండలంలోని తొండ్లాయి గ్రామానికి చెందిన కంచోజు వెంకటాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో నెమ్మాని జడ్పీహెచ్‌ఎస్ 1998-99 బ్యాచ్‌కు చెందిన అతని క్లాస్‌మేట్లు అందరూ సేకరించిన విరాళాల మొత్తం రూ.30వేలు శనివారం వెంకటాచారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చింత సుధాకర్, రామచంద్రం, కవిత, పద్మ, పురుషోత్తం, మదనాచారి పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

కనగల్, మే 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లో జరిగే బాల సాహిత్య సదస్సులో ఊగుతున్న ఉయ్యాల బాలగేయాల సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు పుస్తక రచయిత, కవి, ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చిరెడ్డి బాల సాహిత్య రంగంలో కొన్నేళ్లుగా అనేక పుస్తకాలను ప్రచురించారు.

పూడికతీసేనా?



బొట్టుగూడలో పూడికతో నిండిన డ్రైనేజీ

- డ్రైనేజీ కాల్వలో పేరుకుపోయిన పూడిక
- తీయకపోతే ఇళ్లలోకి నీరు వచ్చే అవకాశం
- వర్షాకాలం ప్రారంభమవుతున్నా దృష్టి సారించని అధికారులు
- చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజల డిమాండ్

రామగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇంకో వారం పది రోజుల్లో వర్షాకాలం సీజన్ ప్రారంభం కానుంది. గతం కంటే ఈ సారి వర్షాలు భారీగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు, ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణంలో పండితులు కూడా చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో నల్లగొండ పట్టణంలో గత ఏడాది వరదకాల్వల్లో నీరు ఉప్పొంగి లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు వచ్చిన సంఘటనలు ఉన్నాయి. ఈ ఏడాది ఆ సమస్యను అధిగమించేందుకు పూడికతీత పనులు మునిసిపల్ అధికారులు ఇప్పటికే ప్రారంభించాల్సి ఉంది. కానీ నేటి వరకు ఆ దిశగా అడుగులు కూడా పడలేదు. రెండు రోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షానికే డ్రైనేజీల్లో పూడిక ఉండటంతో ఆయా వరద కాల్వలన్నీ మురుగు నీరు ఉప్పొంగి రోడ్ల మీదికి ప్రవహించింది. అయినప్పటికీ మునిసిపల్ అధికారులు ముందుచూపే లేకుండా పోయింది.

వర్షం వస్తే ఇళ్లలోకే...

నల్లగొండ పట్టణంలో ప్రధానంగా బొట్టుగూడ, ప్రకాశంబజార్, గాంధీనగర్, లెప్రసీ కాలనీ, ఆర్‌పి రోడ్డు, హైదరాబాద్ రోడ్డు వంటి ప్రాంతాల్లో పెద్ద పెద్ద మురుగు కాల్వలు ఉండగా ఇతర కాలనీల్లో చిన్నపాటి డ్రైనేజీ కాల్వలు ఉన్నాయి. అయితే వర్షాకాల సీజన్‌లో ప్రతీ సారి ఆయా ప్రాంతాల్లో మురుగుకాల్వలు సాఫీగా ప్రవహించకపోవడంతో రోడ్ల మీదకి, ఇళ్లలోకి నీరు చేరుతుందేది. అయితే ఈసారి ఆయా ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా మునిసిపల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో ఉన్న



మురుగుకాల్వల్లో పూడికతీత పనులను ప్రారంభించాలని పట్టణ ప్రజలను కోరుతున్నారు.

ఈసారి కూడా మమ నేనా?

నల్లగొండ పట్టణంలో పూడికతీత రెండుమూడేళ్లుగా పనులను ఓ ప్రజాప్రతినిధి కాంట్రాక్ట్‌ను దక్కించుకొని కమిషన్ తీసుకొని పనులను సబ్ కాంట్రాక్ట్‌కు అప్పగించినట్లు అప్పట్లో ఆరోపణలు వెలువెత్తాయి. కాంట్రాక్ట్ తీసుకున్న సబ్ కాంట్రాక్టర్ తమకు గిట్టుబాటు కావడం లేదన్న కారణంతో పనులను తూతూమంత్రంగా చేసి మమ అనిపించినట్లు కూడా అప్పట్లో విమర్శలు వెలువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈసారైనా అధికారులు దగ్గరుండి పనులు సక్రమంగా చేయిస్తారా. లేకా ప్రజాప్రతినిధులకు తలొగ్గుతారా? అనేది ప్రశ్నార్థకంగా ఉంది.

టెండర్ పిలిచే పనుల్లో ఉన్నాం



పూడిక తీసేందుకు ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేయడం, టెండర్ల్ పిలిచే పనుల్లో ఉన్నాం. ఈ సారి పూడికమట్టి తూకం ఆధారంగా సదరు కాంట్రాక్టర్‌గా డబ్బులు చెల్లించడం జరుగుతుంది. టన్ను ధర ఎంత అనేది అంచనా వేస్తున్నాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

ప్రతీసారి రోడ్ల మీదకి నీరు



వర్షం వచ్చిన ప్రతీసారి రోడ్ల మీదకి నీరు వస్తుంది. దీంతో ఎటూ నడవలేని పరిస్థితి ఉంటుంది. కాల్వల్లో మట్టి తీయకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి వస్తుంది. ఈసారైనా మునిసిపల్ అధికారులు అలాంటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకోవాలి.

– పేర్ల యాదమ్మ, రాజ్‌నగర్, స్థానికురాలు

త్రివిధ దళాలకు మద్దతుగా విజయోత్సవ సంబురాలు



మాజీ సైనికులను సన్మానిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి

నల్లగొండ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ గడ్డపై తీవ్రవాద శిక్షణ శిబిరాలను తుదముట్టించే లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత త్రివిధ దళాలకు మద్దతుగా నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సిస్ శిక్షణా కేంద్రంలో మధ్యాన్న భోజన విరామ సమయంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో భిక్షపతి మాజీ సైనికులైన వెంకటాచారి, కేశవులు, భాస్కర్ రెడ్డి, రామచంద్రయ్య, షేక్ ఇమాముద్దీన్, బిక్షంరెడ్డిలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను దేశభక్తి కలిగిన పౌరులుగా తీర్చిదిద్దటం కేవలం ఉపాధ్యాయుల వల్లే అవుతుందని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కత్తుల అరుంధతి, కోర్స్ డైరెక్టర్ అరుణ శ్రీ, ఏఎంవో రాంచంద్రయ్య, టీపీయూఎస్ జి ల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్‌గౌడ్, టీపీఆర్‌టీయూ అధ్యక్షుడు ఫణికుమార్, యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, స్టేట్ రీసోర్స్ పర్సన్ అనురాధ, జిల్లా రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



విద్యార్థులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

చిట్యాల, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడానికి అందరూ సహకరించాలని ఎంఈవో పొనుగోతు సైదానాయక్ కోరారు. ఎస్ఎస్‌సీ ఫలితాల్లో మండలంలోని 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రతిభచాటిన విద్యార్థులను శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ చిట్యాల ఆధ్వర్యంలో సన్మానించి నగదు ప్రోత్సాహం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జనగాం రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పాటి మాధవరెడ్డి, కంభంపాటి సతీష్, మునుగోటి స్వామి, కార్యదర్శి రేగులగడ్డ నర్సింహగౌడ్, పంతంగి కరుణాకర్‌గౌడ్, పొన్నం లక్ష్మయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు అండర్ పాసింగ్‌ల కోసం తీర్మానం



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చిట్యాల, మే24, (ఆంధ్రజ్యోతి): చిట్యాలలో జాతీయరహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిధిలో మరో రెండు అండర్ పాసింగ్‌లు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. చిట్యాల మున్సిపల్ కార్యాలయంలో శనివారం నారబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ వద్ద ఒక అండర్‌పాసింగ్ మాత్రమే ఏర్పాటు చేస్తుండటం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, బస్టాండ్ వద్ద ఒకటి, వనిపాకల రోడ్డు వద్ద మరో అండర్‌పాసింగ్ ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. దీనికోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు కేంద్ర మంత్రులను కూడా కలవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, చికిలంమెట్ల అశోక్, మాస శ్రీనివాస్, పొన్నం లక్ష్మయ్య, ఎద్దులపురి కృష్ణ, కొంపెల్లి అశోక్, సైదులు పాల్గొన్నారు.


అర్హులందరికీ రాజీవ్ యువవికాసం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మర్రిగూడ, మే 24 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకం అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బూడిద సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అఖిల భారత యువజన సమాఖ్య మండల మహాసభలో ఆ యన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 12 గురుకుల పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని అన్నారు. అనంతరం మర్రిగూడ ఏఐవైఎఫ్ నూతన కమిటీని నియమించారు. మండల ప్రధాన కార్యదర్శిగా ఇస్కిళ్ల మహేందర్, అధ్యక్షుడిగా సాయి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐతపాక హరికృష్ణ, సహాయ కార్యదర్శిగా పొట్ట అశోక్, ఉపాధ్యక్షుడు అంబోతు సుమన్ తదితరులను ఎన్నుకున్నారు.

తేలకంటిగూడెంలో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు



ఎల్ఈడీ లైట్లతో అధికారులు

కనగల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేలకంటిగూడెం గ్రామంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంజూరు చేసిన రూ.2 లక్షల సొంత నిధులతో కొనుగోలు చేసిన ఎల్ఈడీ లైట్లను గ్రామంలో శనివారం ఏర్పాటు చేసారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి క్రాంతి, మాజీ సర్పంచ్ బోగరి రాంబాబు, నామ శ్రీనివాస్, నాగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి




ఐఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న సురేష్‌కుమార్

కేతేపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడేది ఐఎన్‌టీయూసీ అనుబంధ 327 యూనియన్ మాత్రమేనని ఆ సంఘం నాయకుడు సురేష్‌కుమార్ అన్నారు. మేడే వేడుకల్లో భాగంగా మండల కేంద్రం కేతేపల్లిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్స్, కలెక్షన్ ఏజెంట్లు, స్పాట్ బిల్లింగ్, స్టోర్ హమాలీలతో పాటు వివిధ రకాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి త్వరలో యూనియన్ ద్వారా ఉప ముఖ్యమంత్రి భట్టి వి క్రమార్కతో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ చర్చల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు సత్వరం పరిష్కారమయ్యేలా యత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్‌కుమార్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కె.సమ్మిరెడ్డి, నాయకులు పాండు, శ్రీనివాసులు, రాములు, శ్రీను, వెంకన్న, వెంకట్రావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'పై భానుడి ఎఫెక్ట్

(5వ పేజీ తరువాయి)



4200 దూరమయ్యారు. ఇక మార్చిలో 2,24,907 మంది లబ్ధి పొంది 4వేల మంది పథకానికి దూరమయ్యారు. ఏప్రిల్‌లో 2,18,910 మందికి వర్తించింది. 10 వేల మందికిపైగా దూరమయ్యారు. ఇక మే నెలలో కూడా 11200 వేలకు పైగా మంది లబ్దిదారులు గృహజ్యోతికి దూరం కాగా 2,17,707 మంది వినియోగదారులు లబ్దిపొందినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఎండల తీవ్రత కారణంగా జిల్లాలో 21 వేల మందికి పైగా లబ్ధిదారులకు ఏప్రిల్, మే నెలలో ఈ పథకం వర్తించకుండా పోయింది. నిర్దేశిత యూనిట్లు దాటిన వారికి నెలకు రూ. వెయ్యి నుంచి రూ. 1200 వరకు బిల్లు వస్తుంది.

200 యూనిట్లు దాటితే వర్తించదు



ఎండల తీవ్రత కారణంగా విద్యుత్ వినియోగం పెరిగింది. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరగడంతో యూనిట్లు పెరుగుతున్నాయి. జిల్లాలో మొత్తం 2,28907 మందికి గృహజ్యోతి పథకం వర్తించగా, ఏప్రిల్ నెలకు సంబంధించి 2,18,910 మంది వినియోగదారులకు మాత్రమే వర్తించింది. అయితే పథకానికి శాశ్వతంగా పథకానికి దూరం కారు. తిరిగి 200 యూనిట్లలోపు వాడుకుంటే యథావిధిగా ఉచిత విద్యుత్ రాయితీ లభిస్తుంది.

– ఏ. వెంకటేశ్వర్లు, ఎస్ఈ, నల్లగొండ

బీఆర్ఎస్ అంతర్గత విషయాలు పరిష్కరించుకోవాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, మే 24(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నాయకులు వారి అంతర్గత విషయాలు పరిష్కరించుకోకుండా కాంగ్రెస్ నాయకులపై విమర్శ చేయడం సరికాదని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుడు హరీష్‌రావును పార్టీలో తొక్కడం కోసమే కేటీఆర్, కవిత ఆట ఆడుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఇస్తున్న స్క్రిప్టునే కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు మెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. పదేళ్లలో దేశంలోనే బీఆర్ఎస్ నాయకులు ఎంతో అవినీతికి పాల్పడ్డారని, కేసీఆర్ పక్కన దెయ్యాలు ఉన్నాయని కవిత మాట్లాడుతుందని ఆమె దృష్టిలో ఒక దెయ్యం కేటీఆర్, మరో దెయ్యం సంతోష్‌రావు కావచ్చన్నారు. సమావేశంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు, ఏఎంసీ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి యేసుపాదం, నాయకులు లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రామగిరి - గురజాల రోడ్డుకు మరమ్మతులు

- చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేయిస్తున్న చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్

శాలిగౌరారం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నకిరేకల్ - గురజాల ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. చాలా సంవత్సరాల నుంచి రామగిరి నుంచి గురజాల వరకు ఉన్న 4 కిలోమీటర్లు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మోకాలు లోతు గుంతలు ఉండటం వల్ల భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు కూడా రోడ్డు మీద వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు అధ్వాన రోడ్డును పట్టించుకోవడం లేదు. ఫలితంగా 40 గ్రామాల ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ శిథిలావస్థకు చేరిన రోడ్డును పరిశీలించి చలించిన చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.50వేల ఖర్చు పెట్టి 4కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు గుంతలను మొరం మట్టితో మరమ్మతులు చేయించారు. ప్రభుత్వం, అధికారులు చేయలేని పనిని ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి గుంతలు పూడ్చి మరమ్మతులు చేసిన రామకృష్ణగౌడ్‌ను పలు గ్రామాల ప్రజలు, వాహనచోదకులు అభినందించారు. ఈ రోడ్డు మరమ్మతుల కార్యక్రమంలో చైత్ర ఫౌండేషన్ సలహాదారులు బుడిగె శ్రీనివాసులు, సభ్యులు దునక వెంకన్న, దామెర్ల శ్రీనివాస్, వీరస్వామి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో విజయ్‌భాస్కర్

మునుగోడు, మే 24 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిబంధనలు అతిక్రమించి బహిరంగ ప్రదేశాల్లో వీధుల్లో చెత్తా చెదారం వేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మునుగోడు ఎంపీడీవో విజయ్‌భాస్కర్ హెచ్చరించారు. పట్టణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ వ్యాపార దుకాణాదారులకు బహిరంగ ప్రదేశంలో చెత్త వేయడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఇకపై ఏ ఒక్కరూ చెత్తను వీధుల్లో, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బుట్టలో వేసి ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. తద్వారా పారిశుధ్య సమస్యలు నెలకొనకుండా ఉంటాయని పేర్కొన్నారు. పట్టణంలో పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీవో స్వరూపరాణి, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'కేంద్రప్రభుత్వం మొండివైఖరి వీడాలి'

నల్లగొండరూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): నక్సలిజాన్ని అంతమొందించాలని కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని విడనాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని ఏరివేస్తామని కేంద్రప్రభుత్వం వైఖరి సరికాదన్నారు. ఒక పక్క పాకిస్థాన్‌తో చర్చలు జరుపుతూ దేశంలోని పౌరులను ఏరివేసేందుకు ఎజెండా పెట్టుకున్నారని విమర్శించారు. మావోయిస్టులు పెట్టుకున్న ఎజెండా గురించి కేంద్రప్రభుత్వం చర్చించకపోవడం సరైందని కాదని అన్నారు. కేంద్రప్రభుత్వం మావోయిస్టులతో శాంతిచర్చలు నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

మిర్యాలగూడ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ యువ విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలగిరి అంజి అన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయం ఎదుట మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసేందుకు రాగా తీసుకునేందుకు నిరాకరించారన్నారు. ఆయనవెంట పుట్టల సందీప్, నక్క నాగరాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠాపనోత్సవాలు

చింతపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కెళ్లపల్లి మడేలయ్య సీతాలమ్మ, శివనంది ధ్వజ పోతురాజు ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రాంతఃకాల పూజ, మూల మంత్ర హోమం, గోక్షీరాదివాసం, ప్రదోషపూజ, ఉత్సవ విగ్రహాలకు అభిషేకం భక్తిశ్రద్ధలతో జరిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గుండ్లపల్లి అనితానరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో డాక్టరేట్



ఝాన్సీని అభినందిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

దేవరకొండ, మే24(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణానికి చెందిన గడ్డం ఝాన్సీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ సాధించారు. ఫొటో వోల్టాయిక్ ఆధారిత డ్యుయల్ యాక్టివ్ ఫుల్ బ్రిడ్జి డీసీ-డీసీ కన్వర్టర్ కంట్రోలర్ లిథియం అయాన్ బ్యాటరీ చార్జర్ అనువర్తనానికి ఆప్టిమైజేషన్ అనే అంశంపై ప్రొఫెసర్ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించింది. 10వ తరగతి వరకు దేవరకొండ ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసించిన ఝాన్సీ బీటెక్ జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో, ఎంటెక్ జేఎన్‌టీయూ అనంతపురంలో పూర్తిచేసింది. 2009 నుంచి ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోన్నారు.ఝాన్సీకి డాక్టరేట్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు,మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బెల్ట్‌లను ప్రదానం చేస్తున్న కోచ్

దామరచర్ల, మే 24(ఆంధ్రజ్యోతి): తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు శనివారం మండల కేంద్రంలో వివిధ రకాల బెల్ట్‌లను ప్రదానం చేశారు. స్థానిక శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియంలో రమేష్ తైక్వాండో అండ్ ఫిట్‌నెస్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 32 మంది ట్రైనింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎల్లో, గ్రీన్, బ్లూ బెల్ట్‌లను కోచ్ రమేష్ ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎగ్జామినర్ మహమూద్ యూనస్, కమల్, అంబటి ప్రణీత్, పవన్‌కల్యాణ్, మణికుమార్‌లతోపాటుముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ బంటు కిరణ్, మిర్యాలగూడ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సోము సైదిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ లీమా మేరీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విత్తనాల సేకరణ

మిర్యాలగూడ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన విత్తన సేకరణ కొనసాగుతోంది. ప్రకృతి ప్రేమికుడు అవిరెండ్ల సందీప్ మాట్లాడుతూ మిత్రులతో కలిసి రెండు లక్షల విత్తనాలు సేకరించి వర్షాకాలంలో నియోజకవర్గ వ్యాప్తంగా చల్లే కార్యక్రమం చేపట్టామన్నారు. అందులో భాగంగా శనివారం అగ్రిగోల్డ్ కాలనీ, పాతమార్కెట్ యార్డుల్లో గానుగ, ఆల్బిజియా, వేప తదితర విత్తనాలు 5 వేల విత్తనాలు సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో ధైద పవన్, ఉబ్బపల్లి రాజేష్, కందికంటి సైదులు, సాయినాథ్, విజయ్, ఆర్. సైదు లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు నిర్మించాలి



దేవరకొండలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, మే 24(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన పార్టీ పట్టణ 14వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవరకొండలో ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో పేరు ఉన్నప్పటికీ సొంత స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాన్ని మంజూరు చేసి ఇళ్లు నిర్మించాలన్నారు. పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హమీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వలమాల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన మహసభలో దేప సుదర్శన్‌రెడ్డి, జూలూరి వెంకట్రాములు, లింగంపల్లి అనిత పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : ప్రజా పోరాటాల పార్టీ సీపీఐ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి సోమ్లానాయక్ అధ్యక్షతన జరిగిన గ్రామ శాఖ సభలో ఆయన మాట్లాడారుఈనెల 29న చెన్నంనేనిపల్లిలో జరిగే మండల స్థాయి 4వ మహా సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గుమ్మకొండ వెంకటేశ్వ రెడ్డి, కల్లు చరణ్‌రెడ్డి, మల్లయ్యచారి, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ.. భవితకు రక్షణ

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

ప్రస్తుతం చాలా వరకు చిన్నారులు సెలవుల్లో అమ్మమ్మ, బంధువుల ఇంటికి వెళ్లడంతో పాటు సెలఫోన్లలో కాలక్షేపం చేస్తుంటారు. కానీ మిర్యాలగూడ పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు తమకు ఆసక్తి గల అంశంలో శిక్షణ పొందుతూ ముందుకు సాగుతున్నారు. డ్యాన్స్, కంప్యూటర్, చెస్ ఆంగ్లభాషలో ప్రావీణ్యం తదితర వాటిలో శిక్షణ పొందుతున్నారు. రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షకుల పర్యవేక్షణలో మెలకువలు నేర్చుకుంటూ తమ ప్రతిభ మెరుగుపర్చుకుంటున్నారు. ఇందులో భాగంగా మిర్యాలగూడ పట్టణ విద్యార్థులు ఉత్సాహంగా కరాటే నేర్చుకుంటున్నారు. పట్టణంలోని అమరవీరుల పార్కులో వివేకానంద కరాటే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మాస్టర్ చిలుకూరి రమేష్‌బాబు అందిస్తున్న ఉచిత శిక్షణకు చిన్నారులు ఆడుతూ, పాడుతూ వస్తున్నారు. వేసవి సెలవులను ఆస్వాదిస్తూనే కరాటే నేర్చుకుంటున్నామని చిన్నారులంటుండగా.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు ఆటల పట్ల ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తున్నామంటున్నారు శిక్షకుడు.

● మిర్యాలగూడలో కరాటేలో ఉచిత శిక్షణ అందిస్తున్న మాస్టర్ ● ఆడుతూ పాడుతూ నేర్చుకుంటున్న విద్యార్థులు



అమరవీరుల పార్కులో కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు (ఫైల్)

నిరంతరం ఉచిత శిక్షణ



రెండు దశాబ్దలకాలంగా విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నా. ఆసక్తి గల విద్యార్థులకు సాధారణ రోజుల్లో కూడా శిక్షణ ఉంటుంది. శిక్షణ పొందిన విద్యార్థులు కొందరు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. గతంలో బాలురు మాత్రమే కరాటే క్లాసులకు వచ్చేవారు, ఇప్పుడు బాలికలు సైతం ఆసక్తిగా వస్తున్నారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను.

చిలుకూరి రమేష్‌బాబు, మాస్టర్

బాగా నేర్పుతున్నారు



ఇక్కడ కరాటే శిక్షణ బాగా ఇస్తున్నారు. రాగానే వామప్ చేయించిన అనంతరం నేర్చుకున్న అంశాలపై కాసేపు సాధన చేయిస్తున్నారు. కరాటేలో మెలకువలు నేర్పిస్తూనే సెల్ఫ్ డిఫెన్స్, పుషింగ్ తదితర టెక్నిక్స్ నేర్పిస్తున్నారు. నాతో పాటు నా మిత్రులు కూడా కరాటే క్లాసులకు వస్తుండటంతో సెలవులను ఎంజాయ్ చేస్తున్నాం. - శృతి కీర్తి

ఉదయం కరాటే, సాయంత్రం క్రికెట్



హాలిడేస్‌ను ఎంజాయ్ చేస్తున్నా. ఉదయం కరాటే శిక్షణ తీసుకుంటూనే సాయంత్రం మిత్రులందరం కలిసి క్రికెట్ ఆడుతున్నాం. ఉదయం కరాటే శిక్షణతో రోజంతా హుషారుగా ఉంటుంది. నాన్‌చాక్ తిప్పడం కూడా నేర్చుకుంటున్నాను. బాగా నేర్చుకుని పోటీల్లో పాల్గొంటాను. - సాయి కార్తీక్

బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

కొండమల్లేపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, నవగ్రహ పూజ, గణపతి హోమం, లక్ష్మీ కుం కుమార్చన పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జమునా మాధవరెడ్డి, మాజీ జడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ, కేసాని లింగారెడ్డి, నీల లక్ష్మయ్య, కుం భం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగేందర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, బూడిద వెంకటేష్ యాదవ్, బుచ్చిరెడ్డి, రావుల సత్యనారాయణ, బూడిద మల్లేషయాదవ్ పాల్గొన్నారు.



హోమం పాల్గొన్న గ్రామస్థులు

నూతనోత్సాహంతో పనిచేయాలి



మిర్యాలగూడ పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు నూతనోత్సాహంతో పని చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ ముగింపు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తెచ్చే విధంగా గురువులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు జీవన పాఠాలు బోధించి శక్తివంతులుగా తయారు చేయాలన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం శిక్షణనిచ్చిన రీసోర్స్‌పర్సన్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో ఎంఈవోలు బాలాజీనాయక్, బాలునాయక్, అంబటి శ్రీను, సైదిరెడ్డి, మక్బూల్ అహ్మద్, రఘు, తులసీరామ్, సాగరయ్య తదితరులు పాల్గొన్నారు.

● హాలియా: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణతో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని విద్యార్థులకు సులువైన పద్ధతిలో బోధించడానికి వీలవుతుం దని ఎంఈవో గుండా కృష్ణమూర్తి అన్నారు. శనివారం అనుముల మండలంలో వృత్యంతర శిక్షణ 5 రోజుల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ బోధన అమ లు చేయడంలో గల మెలకువల వల్ల వృత్తి నైపుణ్యాలను గణిత సామార్థ్యాలను, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అడ్మిషన్లను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్‌లు మద్దెల ప్రసాద్, మంచికంటి మధు, కట్టా మధు, వీరాసింగ్, సైదిరెడ్డి, హర్షవర్ధన్, సంధ్య, భాను, 80 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హాలియా శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో కృష్ణమూర్తి

గురుకులాల్లో ఇంటర్ విద్య కొనసాగించాలి

మిర్యాలగూడ అర్బన్, మే24(ఆంధ్రజ్యోతి): గురుకులపాఠశాలల్లో ఇంటర్మీడియట్ విద్యను యథావిధిగా కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యను ఎత్తివేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

గురుకులాలు ఎత్తివేయొద్దు

వేములపల్లి : రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 12 గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలలను ఎత్తివేయాలనే నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్ట సంపత్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేడు కార్పొరేట్ కళాశాలలు రూ.లక్షలు ఫీజులు వసూళ్లు చేస్తున్న నేపథ్యంలో ఈ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆసరాగా ఉన్నాయని, వాటిని ఇప్పుడు ఎత్తివేయడం ద్వారా పేద విద్యార్థులకు చదువును దూరం చేయడమేనన్నారు. గురుకులాలను అభివృద్ధి చేసి మరింత మందికి అడ్మిషన్లు ఇచ్చి చదువు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురుకులాలను ఎత్తివేసే ఆలోచనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు.

అపూర్వ కలయిక..ఆత్మీయ పలకరింపు



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హాలియా, మే24(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీలోని పూర్వ నాగార్జున ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను పూలు చల్లుతూ వేదికపైకి సగౌరవంగా వేదికపైకి ఆహ్వానించారు. 25 ఏళ్ల తర్వాత విద్యార్థులందరూ ఒక చోట కలవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాల ప్రాంగణమంతా తిరిగి చూసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కళ్లముందే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తమ ముందట కనిపిస్తుంటే మనసంత ఆనందంతో నిండిపోయిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎ.లింగారెడ్డి, గున్‌రెడ్డి, కోటిరెడ్డి, పాపిరెడ్డి, సురేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి మహ్మద్ కరీం, సునీత, పుణ్యవతి, రంజాన్‌అలీ, ఆనాటి విద్యార్థులు శీలం చంద్రశేఖర్, చెరుపల్లి సుమన్, అనిల్, నారాయణరావు, బాలయ్య, వంశీ, ప్రశాంత్‌రెడ్డి, విజయలక్ష్మి, రాధిక, స్వాతి, అరుణ పాల్గొన్నారు.

నల్లమట్టి టిప్పర్లు అడ్డగింత

చింతపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పర్వతాలు చెరువు నుంచి చింతపల్లి మండలంలోని గొల్లపల్లి మీదుగా వస్తున్న మూడు నల్లమట్టి టిప్పర్లను శనివారం కుర్మేడ్ గ్రామస్థులు అడ్డుకున్నారు. టిప్పర్ల నుంచి మట్టి కిందపడటంతో వర్షకాలం కావడం వల్ల రహదారి చిత్తడిగా మారి ప్రమాదాల జరుగుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. అనుమతి పేరుతో ఇష్టారాజ్యంగా తరలిస్తే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అనంతరం నల్లమట్టి టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

హరితహారం చెట్ల తొలగింపు



రోడ్డుకు ఇరువైపులా ఉన్న తొలగించిన చెట్లు

త్రిపురారం మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంపసాగర్ వెళ్లే రహదారికి ఇరువైపులా పదేళ్ల క్రితం హరితహారం లో భాగంగా వేప, కానుగ, దిరిసిన చెట్లు నాటారు. ఏపుగా పెరిగి పచ్చదనంతో ఆహ్లాదంగా ఉన్న చెట్లను అదే గ్రామానికి చె ందిన కొందరు రహదారికి అడ్డువస్తున్నాయనే నెపంతో ఎక్స్‌వేటర్‌తో సుమారు 30 చెట్ల వరకు శుక్రవారం వేర్లతో సహ తొలగించారు. నీడ నిచ్చే పెద్ద చెట్లను తొలగించడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఉన్నాడని, చెట్ల తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.. చెట్లు ధ్వంసంపై ఎంపీడీవో విజయకుమారిని వివరణ కోరగా చెట్లు తొలగించిన వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. కాగా చెట్లు తొలగించారని పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ ఫిర్యాదు మేరకు ఎక్స్‌కవేటర్ యజమాని కనగంటి భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీపీఐ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్, మే24(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శతజయంతి ఉత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు కోరారు. స్థానికంగా శనివారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బీజేపీ ప్రభుత్వం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపుచేయడంలో విఫలమైందన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను అమల్లోకి తెచ్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూల చట్టాలను రూపొందించి శ్రమజీవుల పొట్టగొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజలు, రైతాంగం, శ్రామికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు కార్యాచరణ రూపొందించి ముందుకెళ్లామన్నారు. సీపీఐ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా జూన్4న యాద్గార్‌పల్లి గ్రామంలో మండల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మండల మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ సయీద్, వల్లంపట్ల వెంకన్న, యాదగిరి, షమీం, బంటు రాజేశ్వరి, బుచ్చయ్య పాల్గొన్నారు.

గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

హాలియా,మే24(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్ డిమాండ్ చేశారు. శనివారం హాలియాలోని విశ్రాంతి ఉద్యోగుల భవన్‌లో టీఆర్‌జీఎస్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసే అభివృద్ధి చేయాలన్నారు. గిరిజనులను చైతన్యవంతులుగా తయారు చేసి వారి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్, రమావత్ నరేష్‌నాయక్, మెగావత్ భాస్కర్ నాయక్, శ్రీనునాయక్, నేనావత్ అశోక్‌నాయక్, చంద్రుడునాయక్, రమావత్ రాజునాయక్, చందర్‌నాయక్, లాలు, రమేష్, దేవేందర్, శ్రీను, రమేష్, ప్రదీప్, శివ, నరేష్, కిరణ్, లాల్‌సింగ్, మునిలాల్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'పై భానుడి ఎఫెక్ట్

(5వపేజీ తరువాయి)

4200 దూరమయ్యారు. ఇక మార్చిలో 2,24,907 మంది లబ్ధిపొంది 4వేల మంది పథకానికి దూరమయ్యారు. ఏప్రిల్ లో 2,18,910 మందికి వర్తించింది. 10 వేల మందికిపైగా దూరమయ్యారు. ఇక మే నెలలో కూడా 11200 వేలకు పైగా మంది లబ్దిదారులు గృహజ్యోతికి దూరం కాగా 2,17,707 మంది వినియోగదారులు లబ్ధిపొందినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఎండల తీవ్రత కారణంగా జిల్లాలో 21 వేల మందికి పైగా లబ్దిదారులకు ఏప్రిల్, మే నెలలో ఈ పథకం వర్తించకుండా పోయింది. నిర్దేశిత యూనిట్లు దాటిన వారికి నెలకు రూ. వెయ్యి నుంచి రూ. 1200 వరకు బిల్లు వస్తుంది.

200 యూనిట్లు దాటితే వర్తించదు

ఎండల తీవ్రత కారణంగా విద్యుత్ వినియోగం పెరిగింది. జిల్లాలో మొత్తం 2,28907మందికి గృహజ్యోతి పథకం వర్తించగా, ఏప్రిల్ నెలకు సంబంధించి 2,18,910 మంది వినియోగదారులకు మాత్రమే వర్తించింది. అయితే పథకానికి శాశ్వతంగా పథకానికి దూరం కారు. తిరిగి 200 యూనిట్ల లోపు వాడుకుంటే యథావిధి ఉచిత విద్యుత్ రాయితీ లభిస్తుంది.

ఏ. వెంకటేశ్వర్లు , ఎస్ఈ, నల్లగొండ.

సమాచారం

నేడు తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలి

దేవరకొండ, చింతపల్లి మే 24(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం దేవరకొండలో ఆదివారం తిరంగా ర్యాలీని నిర్వహించనున్నట్లు దేవరకొండ నిర్వాహకులు కేతావత్ లాలునాయక్, చింతపల్లి బీజేపీ మండలాధ్యక్షుడు సముద్రాల నగేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండలోని టీటీడీ కళ్యాణ మండపం వద్ద సాయంత్రం 5 గంటలకు ప్రారంభమై మీనాక్షి సెంటర్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా శ్రీశ్రీ అంబాత్రేయ క్షేత్ర వ్యవస్థాపకులు శ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ గురువు హాజరుకానున్నట్లు, విద్యార్థి సంఘాలు, మేధావులు, విద్యావంతులు పార్టీలకు అతీతంగా ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. చింతపల్లి మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని ఆయన కోరారు.

సినిమా గైడ్

మిర్యాలగూడ: శ్రీనివాస	: సింగిల్
వెంకటేశ్వర	: ఏస్
రాఘవ	: హిట్ 3
విట్రోస్	: ఏస్, వర్షం
దేవరకొండ : మనోజ్	: ---
మైత్రి వెంకటేశ్వర	: శుభం